
**టాప్ న్యూస్**



### ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే.. ట్రంప్‌ను ఓడించేవాడిని

- జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు
- పార్టీలో ఐక్యత కోసమే వైదొలిగా..

07



### అల్లు అర్జున్‌కు సంక్రాంతి కానుక

- విదేశాలకు వెళ్లొచ్చు..
- ఆదివారం స్టేషన్‌కు రానక్కర్లేదు..

08

### ఢిల్లీ లిక్కర్ పాలసీపై కాగ్ నివేదిక లీక్

- ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లిందని నివేదిక
- 2021లో కొత్త లిక్కర్ పాలసీ తీసుకువచ్చిన ఢిల్లీ ప్రభుత్వం



02



**కంది రామచంద్రారెడ్డి**
***వీకెండ్ అనాలసిస్***

తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికారయంత్రాంగం వైఫల్యం, బాధ్యతారాహిత్యం స్పష్టం. అధికారులు మారకుంటే.. తొక్కి నారతీస్తానంటున్న పవన్ కల్యాణ్ భవిష్యత్ లో ఏం చేస్తాడనేది ఆసక్తికరం. తనకు అధికారం అలంకారం కాదుబాధ్యత అని పవన్ అంటున్నారు. బాధ్యతల్లో ఉన్న వారు ఎవరైతే మాకేంటి అని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. భవిష్యత్ లో ఏపి రాజకీయాలను తిరుమల ఘటన ప్రభావితం చేయొచ్చు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ వరుస సవాళ్ళను ఎదుర్కొంటోంది. కేటీఆర్ ను ఎసిబి, ఈడిలు విచారిస్తుండగా.. అరెస్ట్ జరిగితే ఆ పార్టీకి ఇబ్బందులు తప్పవు. ఎంతోకాలంగా రైతులు ఎదురుచూస్తున్న పెట్టుబడిసాయం, రేషన్ కార్డులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమబాట పడుతున్నారు.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో ›

ANN తెలుగు

Follow: @ANNTELUGU

12-01-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 42 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

### నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీపై వేటు

- గంజి కవితపై అవినీతి ఆరోపణలు
- పోస్టింగ్ ల కోసం లంచాలు.. గుట్కా, రేషన్ మాఫియా నుండి వసూళ్ళు
- నలుగురు కానిస్టేబుళ్ళతో దందా ఆమె అక్రమాలపై లేఖ విడుదల చేసిన సొంత శాఖ సిబ్బంది
- సమగ్ర విచారణ తర్వాత ఆమెను సస్పెండ్ చేసే అవకాశం

వివరాలు 2లో ›

### భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి



- ధ్వంసమైన ఫర్నీచర్, అద్దాలు
- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని యూత్ కాంగ్రెస్ ఆగ్రహం
- ముఖ్యమంత్రిపై ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్న కాంగ్రెస్
- ఖండించిన కేటీఆర్, హరీష్

వివరాలు 2లో ›

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 77,378.91 |
| నిఫ్టీ ↗ | 23,431.50 |

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 79,640 |
| 22 క్యారెట్ | 73,000 |
| సిల్వర్ (కేజీ) | 93,500 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర ₹ | 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.9 | 147 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.9 | 147 |
| రిటైల్ గుడ్డు ధర | 5.19 | 155.82 |



# పట్నం ఖాళీ

## పల్లెకు పోతున్న హైదరాబాద్..

### లక్షల సంఖ్యలో ప్రయాణం
### ఒకటే రద్దీ.. హైదరాబాద్ – విజయవాడ రోడ్ జామ్ జామ్
### సంక్రాంతి సందడి

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగను బంధుమిత్రులతో కలిసి జరుపుకొనేందుకు హైదరాబాద్ నగరవాసులు సొంత ఊళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. అబ్దుల్లాపూర్మెట్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పెద్ద అంబర్పేట్ ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఔటర్‌పై వాహనాలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది భోగికి ముందు రోజు దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు చేరుకోవడానికే 34 గంటల సమయం పట్టింది. ఈ నేపథ్యంలో సంక్రాంతికి ఈ రహదారి మీదుగా పలు ప్రాంతాలకు వెళ్లే వాహనదారుల సౌలభ్యం కోసం పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. సంక్రాంతికి ఊరు వెళ్ళేందుకు రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్ నగర్ కూకట్‌పల్లి, ఎస్ ఆర్ నగర్, అమీర్ పేట్ ప్రాంతాల్లో వాహనాలతో కిటకిటలాడాయి. **- మహా, హైదరాబాద్**

02



### కొత్త రేషన్ కార్డులు ఎన్ని లక్షలైనా ఇస్తాం

**పాత కార్డుల్లో కోతలుండవు.. ఫిబ్రవరిలో భూభారతి చట్టం అమలు**

**ఎవరిపైనా కక్షసాధింపులుండవు.. ఏసీబీ నమోదుచేస్తే.. లొట్టపీసు కేసా**

**మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్ చాట్**

**ఖమ్మం, మహా:** మా ప్రభుత్వం ఎవరి పట్ల కక్షపూరితంగా వ్యవహరించదు... కానీ, ప్రభుత్వ సొమ్మును అప్పనంగా మింగేసిన వారిని మాత్రం వదలబోమని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఫార్ములా ఈరేసు నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేస్తే.. లొట్టపీసు కేసు అంటూ కేటీఆర్ మాట్లాడాల్సిన అవసరం ఏంటని మంత్రి పొంగులేటి సీరియస్ అయ్యారు. శనివారం నాడు మంత్రి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మంత్రులు ఇష్టానుసారంగా తప్పులు చేసి తామేదో గొప్పలు చేశామని చెప్పుకోవడం సిగ్గేచేటని ఎద్దేవా చేశారు. మంత్రలు చెబితేనే తాము చేశామని అధికారులు ఏసీబీ, ఈడీ విచారణలో వాళ్లు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని వివరించారు.

మిగతా 2లో ›

### కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మావోయిస్టుల వార్నింగ్!

**అరాచకాలు ఆపకుంటే అంతు చూస్తాం**

**మహబూబ్ నగర్, మహా:** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని మావోయిస్టులు టార్గెట్ చేశారు. ఆయన స్వగ్రామంలో మావోయిస్టుల పేరిట లేఖను అంటించడం సంచలనంగా మారింది. ఎమ్మెల్యే బలవంతంగా పేదల భూములు లాక్కుంటున్నారని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు.

మిగతా 2లో ›





### మహిళా, శిశు సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

**ఉదయ్‌పూర్ చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క**

- పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు
- కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర భాగస్వామ్యం పెంచాలి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడిలకు గుడ్డును దూరం చేశారు


**మహా :** దేశంలోని ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా మహిళా, శిశు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను చేపట్టిందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలో ని ఉదయపూర్ పట్టణంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన చింతన్ శివిర్ లో మంత్రి సీతక్క ప్రసంగించారు.

మిగతా 2లో ›

### కొండపోచమ్మ ప్రాజెక్టులో ఈతకు వెళ్లి ఐదుగురు యువకులు మృతి

**బయట పడ్డ ఇద్దరు.. మృతులంతా హైదరాబాద్‌వాసులు**

**దుర్ఘటనపై సీఎం రేవంత్, మంత్రి పొన్నం, మాజీ మంత్రి హరీశ్ విచారం**



**సిద్ధిపేట, మహా :** సంక్రాంతి సెలవుల వేళ సిద్దిపేటలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా విహారానికని వెళ్తే అది కాస్త తీరని విషాదంగా మారింది. కొండపోచమ్మ సాగర్‌కు విహారానికి వెళ్లిన ఐదుగురు యువకులు సెల్ఫీ కోసం నీళ్లలో దిగగా ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యారు. ఈ ప్రమాదంలో ఐదుగురు యువకులు ప్రాణాలు వదిలారు.

మిగతా 2లో ›



వివరాలు 2లో ›

### ఏఎన్ఎన్ ఛానల్ దూసుకెళ్లాలి: మేఘారెడ్డి



### యలమంచిలిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**ఏఎన్ఎన్ –వాగ్దేవి కళాశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు**

భోగి మంటలు, రంగురంగుల హరివిల్లులు సందడి చేసిన విద్యార్థులు

03

# కొత్త రేషన్ కార్డులు ఎన్ని లక్షలైనా ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఐతే ఫార్ములా ఈరేసు , కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. విచారణ కాకుండా ఈ ప్రభుత్వం ఏ ఒక్కరినీ అరెస్టు చేయదని, అది బండి సంజయ్ కి కూడా బాగా తెలుసన్నారు. ఏసీబీ రంగాల్లోకి రాగానే ఈడీ ఎంటరైందని వివరించారు. ఈ కారు రేస్ లో అవినీతి జరిగిందని రుజువైంది.. కాబట్టి ఈడీ రంగంలోకి వచ్చిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అన్ని విచారణలు పూర్తయిన వెంటనే అరెస్ట్ ప్రక్రియ కూడా మొదలు కావచ్చన్నారు. రైతులకు వాగ్దానం చేసిన రైతు భరోసా పథకంపై కూడా ఆయన మాట్లాడారు. "రైతుభరోసాకు ఎకరాకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వబోతున్నామన్నారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు మాత్రమే రైతుబంధు ఉండదని స్పష్టం చేశారు. ఎవరూ అభద్రతకు లోనుకావద్దని, అన్ని ప్రభుత్వ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. అలాగే, సంక్రాంతి పండుగకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నె




రవేర్చేందుకు ఆయన స్పష్టత ఇచ్చారు. "సంక్రాంతికి ముందే పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తాం. జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చేవని.. కానీ, తమ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వనుందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేద లందరికీ ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ఒక సెగ్మెంటుకు 3,500 చొప్పున ఇళ్లను కూడా కేటాయించామన్నారు. నాలుగు విడతల్లో రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఇక భూభారతి చట్టం కోసం చాలా కష్టపడ్డామని, ఫిబ్రవరి 15 నుంచి 28 లోపు ఆ చట్టం పూర్తిగా అమల్లోకి వస్తుందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూ భారతి చట్టం అమలుకు విధివిధానాలు ఉన్నాయన్నారు. చిన్న పొరపాటు కూడా జరగకుండా భూ భారతి చట్టం అమలు చేస్తామన్నారు. ధరణిని ఉపయోగించుకుని తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ అప్పీల్ అథారిటీ పూర్తిగా తొలిగించారు. భూ భారతి చట్టంలో ల్యాండ్ అప్పీల్ అథారిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ధరణి ద్వారా ఆక్రమించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందన్నారు. "మా ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తుంది. అవినీతి చేసే వారిపై చర్యలు తప్పక తీసుకుంటాం" అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని, తమ ప్రభుత్వం ఈ అంశంపై చర్యలు తీసుకుంటుందని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తాం" అని ఆయన తెలిపారు. పోలీసుల పనితీరుపై కూడా మంత్రి పొంగులేటి ప్రశంసలు ఇచ్చారు. "రాష్ట్రంలో పోలీసుల పనితీరు గొప్పగా మారింది. వారు ప్రజల భద్రతను కాపాడడంలో ఎంతో కృషి చేస్తున్నారు" అని మంత్రి ప్రశంసించారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మావోయిస్టుల వార్నింగ్!

### అరాచకాలు ఆపకుంటే అంతు చూస్తాం

(మొదటి పేజీ తరువాయి)

బాలానగర్, రాజాపూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న కంపెనీల నిర్వాహకులను ఎమ్మెల్యే, ఆయన అనుచరులు బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంకా యజమానులను బెదిరించి పట్టాభూములను లాక్కున్నాడని ఆరోపించారు. గతంలో గుడిలో విగ్రాహాలు దొంగిలించి ఎక్కడ అమ్మావో మాకు తెలుసన్నారు. ఇకపై ఇలాంటిది తమ దృష్టికి వస్తే వదిలిపెట్టేది లేదని వార్నింగ్ ఇచ్చారు. లచ్చన్నదళం పేరిట ఈ లేఖ స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ లేఖపై విచారణ జరుపున్నారు.





## ఢిల్లీ లిక్కర్ పాలసీపై కాగ్ నివేదిక లీక్

### ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లిందని నివేదిక

**2021లో కొత్త లిక్కర్ పాలసీ తీసుకువచ్చిన ఢిల్లీ ప్రభుత్వం**

**అవినీతి జరిగినట్టు ఆరోపణలు..దర్యాప్తు చేస్తున్న సీబీఐ, ఈడీ**

**మహా:** సంచలన ఢిల్లీ లిక్కర్ పాలసీపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక తాజాగా లీక్ అయింది. లీకైన వివరాల మేరకు... లిక్కర్ పాలసీలో అవకతవకల కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ పేర్కొంది. మద్యం లైసెన్సుల జారీలో అక్రమాలు జరిగాయని, నిపుణుల కమిటీ సిఫారసులను పక్కనబెట్టారని వివరించింది. టెండర్లలో బిడ్డింగ్ వేసిన కంపెనీల ఆర్థిక పరిస్థితిని ఎలాంటి పరిశీలన చేయలేదని తెలిపింది. నష్టాల్లో ఉన్న కంపెనీలకు కూడా బిడ్లు వేసే అవకాశం కల్పించారని, పైగా ఆ కంపెనీల లైసెన్సులను కూడా పునరుద్ధరించారని కాగ్ వెల్లడించింది. నాటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆధ్వర్యంలోని మంత్రుల బృందం లిక్కర్ పాలసీలో కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తీసుకోలేదని పేర్కొంది. లిక్కర్ పాలసీని సరిగ్గా అమలు చేయడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని, తద్వారా లిక్కర్ పాలసీ లక్ష్యా



లను ప్రభుత్వం అందుకోలేకపోయిందని కాగ్ స్పష్టం చేసింది. 2021 నవంబరులో ఢిల్లీ సర్కారు తీసుకువచ్చిన కొత్త లిక్కర్ పాలసీ ప్రకంపనలు సృష్టించింది. ఇందులో అవినీతి జరిగిందంటూ సీబీఐ, ఈడీ దర్యాప్తు చేపట్టడం... ఆప్ ప్రభుత్వ పెద్దలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా జైలుకు వెళ్లడం తెలిసిందే. ఇదే కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత కూడా జైలుకు వెళ్ళిన విషయం విదితమే.


## రేట్లు ఇష్టారాజ్యంగా పెంచడం కుదరదు

### కేఎఫ్ బీర్ల తయారీ సంస్థకు సీఎం స్ట్రాంగ్ కౌంటర్

**రేట్లు పెంచాలంటూ చేసే డిమాండ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదు**

**వినియోగదారులకు నాణ్యమైన మందును మాత్రమే సరఫరా చేయాలి**

**ఎక్సైజ్ శాఖ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం**



**హైదరాబాద్, మహా :** తెలంగాణాలో రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వనందున యునైటెడ్ బేవరేజెస్ సంస్థ తన కేఎఫ్ బీర్ల సరఫరాను రాష్ట్రంలో నిలిపివేసిన నేపథ్యంలో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో అనేక ముఖ్యమైన అంశాలపై అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రేట్లు పెంచాలంటూ చేసే డిమాండ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదని అన్నారు. తెలంగాణలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించిన సీఎం రేవంత్ రెడ్డి.. పారదర్శక విధానం పాటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో కట్టుదిట్టం గా ఉండాలని సూచించిన రేవంత్ రెడ్డి.. కొత్త సంస్థల నుంచి దరఖాస్తులు తీసుకునే ముందు నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించారు. ఆ తర్వాత నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ఆదేశించారు. ఇష్టానుసారం.. దరఖాస్తు చేసుకున్న బ్రాండ్లకు పర్మిషన్లు ఇవ్వడం కాదని.. ఆయా కంపెనీల నాణ్యతా ప్రమాణాలు, సరఫరా సామర్థ్యాన్ని పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటికే టీజీబీసీఎల్ కు సరఫరా చేస్తున్న కంపెనీలు.. కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారులకు నాణ్యమైన మందును మాత్రమే సరఫరా చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఏ దశలోనూ అజాగ్రత్తగా వ్యవహరించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ.. తన బీర్ల రేట్లను రాష్ట్రంలో 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిన విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయమై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఎట్టి పరిస్థితుల్లో కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని తేల్చి చెప్పారు. పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరల్ని పరిశీలించాలని సూచించారు. ఆయా రాష్ట్రాల కంటే ఎక్కువ ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. బేవరేజెస్ సంస్థలకు రేట్ల విషయమై హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ, నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గత ఏడాదిగా ఎక్సైజ్ శాఖ కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను క్రమంగా క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లలో.. గిరిజనులకు ప్రాధాన్యం

### ప్రెస్ అకాడమీతో చర్చించి త్వరలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు

**2029లో రాహుల్ ప్రధాని కావడం ఖాయం..తెలంగాణలో మళ్ళీ కాంగ్రెస్ దే అధికారం**

**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**నల్గొండ, మహా :** ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడ్డారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక రెవెన్యూ వ్యవస్థ రాబోతోందన్నారు. వీఆర్వో లు వీఆర్ఏలు రాష్ట్రంలో సుమారు 23 వేలమంది ఉన్నారని చెప్పారు. వాళ్లలో 16300 మంది రెవెన్యూశాఖలోకి రావటానికి దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ప్రెస్ అకాడమీతో చర్చించి త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్‌లు ఇస్తామని ప్రకటించారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు



## పదవ తరగతితో అగ్నివీర్ ఉద్యోగాలు



### మొదలైన దరఖాస్తు ప్రక్రియ

**హైదరాబాద్, మహా :** అగ్నివీర్ వాయు ఉద్యోగాల్లో చేరాలని అనుకునే వారికి ఇదే మంచి అవకాశం. దేశ వాయు సేనలో అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత ఉన్న వారు వెంటనే దీనిని సద్విని యోగం చేసుకోండి. జనవరి 7నుంచే అప్లికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. అర్హత ఉండి ఆసక్తి కలిగిన అభ్యర్థులందరూ ఈ ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకోండి. టెన్త్, ఇంటర్మీడియట్ 50 శాతం మార్కులతో పాసైన అభ్యర్థులు ఈ ఉద్యోగాల్లో చేరవచ్చు. ఆన్ లైన్ పరీక్షకు మూడు రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్ కార్డులు అభ్యర్థుల వ్యక్తిగత ఈ మెయిల్ కు వస్తాయి. 7 వ తేదీ నుంచి దరఖాస్తు ప్రారంభమైంది. 27 వ తేదీ సాయంత్రం గం. 5 లోగా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలోనే నెలకు రూ. 40 వేల వరకు జీతం ఉంటుంది. అఫీషియల్ వెబ్ సైట్: https://agnipathvayu.cdac.in/AV/.

## ఏఎన్ఎన్ ఛానెల్ దూసుకెళ్లాలి

### నూతన క్యాలెండర్ ఆవిష్కరణ.. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, మహా:** ప్రముఖ ఏఎన్ఎన్ తెలుగు న్యూస్ ఛానెల్ నెంబర్ వన్ గా దూసుకెళ్లాలంటూ వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆకాంక్షించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్ లో ఏఎన్ ఎన్ (అమ్మ న్యూస్) నూతన సంవత్సర క్యాలెండర్ ను వనపర్తి జిల్లా రిపోర్టర్ ఈశ్వర్ సాగర్ ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఏఎన్ఎన్ న్యూస్ ఛానల్ ప్రజా సమస్యలను వెలికితీయడానికి విశేషంగా కృషి చేయడంతోపాటు వాటి పరిష్కారానికి బాధ్యతగా ముందుకు నడుస్తుందని అన్నారు. ప్రజల ఆకాంక్షతో కొనసాగుతున్న ఏఎన్ఎన్ న్యూస్ ఛానల్ ను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా మెలగాలని ఏఎన్ఎన్ న్యూస్ ప్రేక్షకులకు, వనపర్తి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, జర్నలిస్టులు ఆంజనేయులు, సుంకరి రమేష్, దినేష్, చిన్న రాజు, మల్లికార్జున్, శ్రీనాథ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.




## నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీపై వేటు

### గంజి కవితపై అవినీతి ఆరోపణలు

**పోస్టింగ్ ల కోసం లంచాలు.. గుట్కా, రేషన్ మాఫియా నుండి వసూళ్ళు**

**నలుగురు కానిస్టేబుళ్ళతో దందా**

**ఆమె అక్రమాలపై లేఖ విడుదల చేసిన సొంత శాఖ సిబ్బంది**

**సమగ్ర విచారణ తర్వాత ఆమెను సస్పెండ్ చేసే అవకాశం**

**నల్గొండ, మహా:** నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై వేటు పడింది. ఆమెను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణల మీద ఆమెపై చర్యలు తీసుకున్నారు. గంజి కవితపై సొంత శాఖ సిబ్బందే ఉన్నతాధికారులకు లేఖ రాయడం గమనార్హం. ఆమె అక్రమాలను పేర్కొంటూ ఏకంగా 9 పేజీల లేఖను వారు విడుదల చేశారు. ఇంటెలిజెన్స్ విభాగంలో పోస్టింగ్ ల కోసం ఆమె లంచాలు వసూలు చేసినట్టు లేఖలో వారు పేర్కొన్నారు. సిబ్బందితో అధిక వడ్డీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయించారని తెలిపారు. ఈ క్రమంలోనే ఆమెపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఆమె ఏడేళ్లు పని చేశారు. ఈ కాలంలో ఆమె గుట్కా, రేషన్ మాఫియాల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. సొంత సిబ్బందిని కూడా ఆమె వదల్లేదని చెపుతున్నారు. నలుగురు కానిస్టేబుళ్లతో ఆమె దందా నడిపించినట్లు తెలుస్తోంది. సమగ్ర విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేసే అవకాశం ఉంది.





## భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

- ధ్వంసమైన ఫర్నీచర్, అద్దాలు
- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని యూత్ కాంగ్రెస్ ఆగ్రహం
- ముఖ్యమంత్రిపై ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్న కాంగ్రెస్
- ఖండించిన కేటీఆర్, హరీష్

**భువనగిరి, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ శ్రేణులు భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో బీఆర్ఎస్ కార్యాలయంలోని ఫర్నీచర్, అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కాగా ఈ దాడిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఖండించారు.

## కొండపోచమ్మ ప్రాజెక్టులో ఈతకు వెళ్లి ఐదుగురు యువకులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు యువకులను స్థానికులు కాపాడటంతో ప్రాణాలతో బయటపడ్డారు. యువకులంతా హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన వారని పోలీసులు గుర్తించారు. యువకులంతా 20 ఏళ్ల లోపువారేనని గుర్తించారు. సంక్రాంతి సెలవులు రావటంతో హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ధనుష్, లోహిత్, చీకట్ల దినేశ్వర్, సాహిల్, జతిన్, మృగాంక్, ఇబ్రహీం ఏడుగురు స్నేహితులు కలిసి సిద్దిపేటలో ఉన్న కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును చూసేందుకు వచ్చారు. ఈ క్రమంలో కొండపోచమ్మ సాగర్ అందాలు ఆస్వాధిస్తూ నీళ్లలోకి దిగారు. నీళ్లలో కాసేపు ఆనందంగా కేరింతలు కొట్టారు. లోపలికి దిగి సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగిపోయారు. అయితే యువకులకు ఈత రాకపోవటంతో ఒకరి చేతిని ఒకరు గట్టిగా పట్టుకోవటంతో అందరూ నీటిలో మునిగిపోయారు. ఇద్దరు యువకులు ప్రాణాలతో బయటపడగా వాళ్లు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన ఐదుగురు యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నీట మునిగి చనిపోయిన యువకులు ధనుష్(20) ఫోటో స్టూడియో వర్కర్, సోదరుడు లోహిత్ (17), చీకట్ల దినేశ్వర్ (17), సాహిల్ (19), జతిన్ (17) ఉన్నారు. గజ ఈత గాళ్ళు మృత దేహాలను వెలికి తీశారు. నీటి లోతును అంచనావేయలేక పోవడంతో వారంతా మునిగి చనిపోయినట్లు భావిస్తున్నారు. ప్రమాదంలో మృగాంక్ (17), ఎండీ ఇబ్రహీం (17) మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఐదుగురి మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన అన్నదమ్ములైన ధనుష్, లోహిత్ భోలక్ పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి నర్సింగరావుకు ఫోటో స్టూడియో ఉంది. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కూతురు వివాహమైంది. ధనుష్ తండ్రి ఫోటో స్టూడియో చూసుకుంటుండగా, లోహిత్ టీకేఆర్ కాలేజీలో డిప్లొమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం 8.30 గంటలకు స్నేహితులతో కలిసి బైక్‌లపై కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లారు. అదే వారి చివరి ప్రయాణమైంది.



### సీఎం తీవ్ర దిగ్భ్రాంతి

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులో యువకుల గల్లంతు ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు యువకులు గల్లంతవటంపై ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గల్లంతైన వారికోసం గజ ఈత గాళ్లను రంగంలోకి దింపాలని ఆదేశించారు. ఘటనా స్థలానికి వెళ్లాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని.. ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### హరీశ్ రావు సంతాపం

మరోవైపు కొండపోచమ్మ సాగర్ ప్రమాదంపై మాజీ మంత్రి మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకులు అకాల మరణం చెందటం మనస్సును కలిచి వేసిందని వాపోయారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పండుగ వేళ బిడ్డల్ని కోల్పోయి బాధలో ఉన్న కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# మహిళా, శిశు సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

## ఉదయ్‌పూర్ చింతన్ శివిర్‌లో మంత్రి సీతక్క

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితోపాటు, అన్ని రాష్ట్రాల మహిళా సి సంక్షేమ శాఖ మంత్రులు అధికారులు హాజరైన ఈ సదస్సుకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ లతో కలిసి మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళా శిశు సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక పథకాలు, సాధించిన పురోగతి, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారం పై మంత్రి సీతక్క మాట్లాడారు. చిన్నారుల, గర్భిణులు బాలింతలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు పోషిస్తున్న పాత్రను వివరించారు. ఆదివాసి బిడ్డగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

తెలంగాణలో ప్రత్యేకంగా ఆరోగ్యలక్ష్మి అనే పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతిరోజు 200 మి.లీ. పాలతో పాటు అదనపు గుడ్డును అందిస్తున్నట్టు తెలిపారు. అందుకోసం ఏటా రూ. 296 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. అంగన్వాడి చిన్నారులకు సైతం పాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. బాలామృతం ప్లస్ ద్వారా పోషకాహార లోపం ఉన్న పిల్లలకు, ప్రత్యేక పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక ప్రకారం సరైన పోషకాహారం అందకపోవటంతో దేశంలో 30 శాతానికి పైగా ఐదేళ్ల లోపు చిన్నారులు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారని, మహిళలు రక్తహీనతతో సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పోరాడితే తప్ప ఈ సమస్యలను రూపుమాపలేమని పేర్కొన్నారు. పోషకాలు అధికంగా ఉన్న కోడిగుడ్లను బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో పంపిణీ చేయడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లను ఇచ్చేందుకు సంస్కృత కారణాలు అడ్డుగా ఉంటే, కోడిగుడ్డు స్థానంలో అధిక పోషకాలు ఉండే ఇతర ప్రత్యామ్నాయ పదార్థాలను అందివ్వాలని, అనుగుణంగా కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. చిన్నారులు, పిల్లలు దేశ వనరులని, వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్న పండిత్ జవహర్లాల్ నెహ్రూ వ్యాఖ్యలను గుర్తు చేశారు.

తెలంగాణలో 35,700 అంగన్వాడి కేంద్రాలను నడుపుతున్నట్లు తెలిపిన మంత్రి సీతక్క, జాతీయ విద్యా విధానం, 2020 కి అనుగుణంగా అంగన్వాడి కేంద్రాల్లో అహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు అంగన్వాడి కేంద్రాలకు ఫర్నిచర్, ఆట వస్తువులను సరఫరా చేయటంతో పాటు రంగురంగుల పెయింటింగ్స్ తో అంగన్వాడి కేంద్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్వయం సహాయక బృందాల మహిళలచే అంగన్వాడి చిన్నారులకు రంగురంగుల యూనిఫామ్ దుస్తులను ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి విజయాలను మంత్రి వివరించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక శక్తులుగా తీసినందుకు వారిచే సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆర్టీసీ బస్సులను, క్యాంటీన్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా లక్షల సంఖ్యలో యూనిఫామ్ లను కుట్టించి సరఫరా చేసినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా అంగన్వాడి సిబ్బందికి వేతనాలు అందిస్తున్నామన్నారు. అయితే పెరిగిన ధరలు, జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాలకు తగ్గిన ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం తన వాటాను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటాగా అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడి హెల్పర్ల గౌరవేతనాలను రూ. 10 వేలు, రూ.1 7 వేలకు పెంచాలని కోరారు. తెలంగాణ తరహాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని సూచించారు.

తెలంగాణలో మహిళా సంక్షేమం కోసం 15.26 లక్షల మంది విడోలకి , 1.41 లక్షల ఒంటరి మహిళలకు నెలకు రూ. 2000 పెన్షన్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే విడోలకి ఇస్తున్న పెన్షన్ లో కేంద్రం తన వాటాగా 200 రూపాయలు మాత్రమే ఇస్తోందని, గత పది ఏళ్లుగా ఈ మొత్తం పెరగలేదని గుర్తు చేసిన మంత్రి సీతక్క, పెరిగిన ధరలు అవసరాలకు అనుగుణంగా పెన్షన్ మొత్తం పెంచాలని కోరారు. మిషన్ వాత్సల్య కింద ..ప్రభుత్వ పిల్లల సంరక్షణ సంస్థలన్నిటిని జిల్లాస్థాయిలో బాల రక్ష భవన్స్ పేరుతో ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చినట్టు తెలిపారు. తద్వారా ఎలాంటి సమన్వయ సమస్యలు లేకుండా పిల్లలకి సంపూర్ణ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో 33 జిల్లాల్లో 39 బాల రక్షక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, అవసరం ఉన్న పిల్లల వద్దకు చేరుకొని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ నుండి శిశు విహార్ ద్వారా ఆరేళ్ళలోపు పిల్లల దత్తత ప్రక్రియను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల కోసం చేపట్టిన చర్యలు, స్పెషల్ హోం ప్రాంగణంలో నిర్వహి



స్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్, స్పెషల్ హోమ్ పిల్లల కోసం 6 వేల చదరపు గజాల్లో నిర్వహిస్తున్న క్రీడా ప్రాంగణాలు, జువెనైల్ పిల్లల కోసం నైపుణ్య శిక్షణ కార్యక్రమాల వివరాలను మంత్రి సీతక్క వివరించారు. మిషన్ శక్తి కింద అత్యాచార, ఫోక్సో బాధితుల కోసం తెలంగాణలో పోలీసుల సహకారంతో 35 భరోసా సెంటర్లను నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. లైంగిక దాడులు అత్యాచార బాధితులకు గ్రీన్ చాలా ద్వారా పరిహారాన్ని అందిస్తున్నామన్నారు. అనాథ పిల్లల కోసం దుర్గాబాయి దేస్ ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఏటా 240 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, అందులో 70 శాతం సీట్లను అనాథలకు రిజర్వ్ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ లో మహిళల కోసం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, అందులో ఇప్పటికే 8 మంది ట్రాన్స్ జెండర్ లతో పాటు మొత్తం 950 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. పని ప్రాంతాల్లో జరిగే లైంగిక వేధింపుల కేసులను సత్వరం పరిష్కరించేందుకు ఎనిమిది లేబర్ కోర్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్ జెండర్ లను ట్రాఫిక్ కానిస్టేబుల్ గా నియమించామన్నరు. ట్రాన్స్ జెండర్ ల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మైత్రి క్లినిక్ ను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని గుర్తు చేశారు. వికలాంగుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా జాబు పోర్టల్ ను అందుబాటులోకి తెచ్చామని, చరిత్రలో మొట్టమొదటిసారిగా వికలాంగుల పరికరాల కోసం 50 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. తెలంగాణలో మహిళా శిశు సంక్షేమం కోసం అమలవుతున్న ప్రత్యేక పథకాలను మంత్రి సీతక్క వివరించడంతో పాటు, కేంద్ర సౌజన్యంతో అమలయ్యే పథకాల్లో కేంద్రం తన వాటాను పెంచాలని మంత్రి సీతక్క లెక్కలతో సహా వివరించారు.

## సంక్రాంతి పండుగ వేళ..
## రైల్వేశాఖ గుడ్‌న్యూస్

సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రయాణికుల కోసం రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే అదనపు రైళ్లను నడపడానికి దక్షిణ మధ్య రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 26 అదనపు రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనవరి 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఈ అదనపు రైళ్లు అందుబాటులో ఉంటాయని ప్రకటించారు. చర్లపల్లి నుంచి విశాఖపట్నానికి, సికింద్రాబాద్ – బెంగళూరు మధ్య అదనపు రైళ్లను నడపుతున్నట్లు వివరించారు.



# పట్నం ఖాళీ

**హైదరాబాద్, మహా:** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగను బంధుమిత్రులతో కలిసి జరుపుకొనేందుకు హైదరాబాద్ నగరవాసులు సొంత ఊళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. అబ్దుల్లాపూర్మెట్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పెద్ద అంబర్పేట్ ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఔటర్పై వాహనాలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది భోగికి ముందు రోజు దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు చేరుకోవడానికే 34 గంటల సమయం పట్టింది. ఈ నేపథ్యంలో సంక్రాంతికి ఈ రహదారి మీదుగా పలు ప్రాంతాలకు వెళ్లే వాహనదారుల సౌలభ్యం కోసం పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. సంక్రాంతికి ఊరు వెళ్ళేందుకు రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్ నగర్ కూకట్‌పల్లి, ఎస్ ఆర్ నగర్, అమీర్ పేట్ ప్రాంతాల్లో వాహనాలతో కిటకిటలాడాయి.

**విజయవాడవైపు యమ రద్దీ**

విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై గత రాత్రి నుంచి కొనసాగుతున్న వాహనాల రద్దీ కారణంగా యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ భారీగా కొనసాగుతుంది. రద్దీని నియంత్రించేందుకు టోల్ ప్లాజా సిబ్బంది, పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా 10 టోల్ బూత్లను విజయవాడ వైపు తెరిచారు. సంక్రాంతి సంబరాలు కోసం హైదరాబాద్ వాసులు ప్రతి ఏటా సొంతూళ్లకు వెళతారు. ఈ ఏడాది కూడా పల్లెలకు బయలుదేరుతున్నారు. పట్నం ఖాళీ అవుతుంది . రెండురోజులుగా రాత్రి జేఎన్టీయూ, కేపిహెచ్ బి, ఎస్సార్ నగర్ పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనాలు నిలిచిపోయాయి. రైలు, బస్సులు, కార్లు , బైకులు ప్రతి వాహనంలో పల్లె వైపు కదులుతున్నారు.

## రోజుకు 60 వేలకుపైగా వాహనాలు

సాధారణ రోజుల్లో 35,000 నుంచి 45,000 వాహనాలు వెళ్తాయని, సంక్రాంతి పండుగ సందర్భంగా మాత్రం శుక్రవారం ఒక్క రోజే 55 వేల వాహనాలు వెళ్లినట్లు ఇక్కడి అధికారులు చెబుతున్నారు. శనివారం ఈ సంఖ్య ఇంకా పెరిగింది. ఈరోజు జాతీయ రహదారిపై వాహనాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగానే ఇక్కడ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నాలుగు సెకండ్లలో ఒక వాహనం చొప్పున టోల్ ప్లాజా నుంచి వెళ్తుంది. నిమిషానికి 330 వాహనాలు విజయవాడ వైపు వెళ్తున్నట్లు సమాచారం.





# యలమంచిలిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

## ఏఎన్ఎన్ ఛానల్ – వాగ్దేవి కళాశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

### భోగి మంటలు, రంగురంగుల హరివిల్లులు.. సందడి చేసిన విద్యార్థులు

**విశాఖ, మహా:** అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఏఎన్ఎన్ శాటిలైట్ ఛానల్ వాగ్దేవి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో విద్యార్థులు పాల్గొనేందుకు ఆసక్తి చూపించారు. పెద్ద ఎత్తున రంగుల హరివిల్లుగా ముగ్గులను వేసి చూపరులను ఆకట్టుకున్నారుత. ఈ సందర్భంగా భోగి మంటలతో రంగుల హరివిల్లుతో వాగ్దేవి కళాశాల సందడిగా మారింది. ఈ ముగ్గుల పోటీలకు న్యాయకర్తలుగా అడపా కృష్ణవేణి, అరుణ, సరళలు వ్యవహరించారు. వారికి వాగ్దేవి కళాశాల యాజమాన్యంతోపాటు విద్యార్థులు స్వాగతం పలికారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అడపాశేషగిరిరావు, ప్రకాష్, సుబ్బారాయుడుల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలను వేసి సంబరాలు జరిపారు. కృష్ణవేణి, అరుణ, సరళలు మాట్లాడుతూ .. వాగ్దేవి కళాశాలలో ముగ్గుల పోటీలను ప్రతీయేటా ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ కర్తలుగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఆ ముగ్గుల పోటీలను ఈ ఏడాది



ఏఎన్ఎన్ ఆధ్వర్యంలో నిర్వహహించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు ముగ్గులు అనేవి తెలియకుండా పోయిందని, అలాంటి పరిస్థితి నుండి విద్యార్థులు సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తున్న కళాశాల యాజమాన్యంకు, వారికి సహకారాన్ని అందించిన ఏఎన్ఎన్ ఛానల్ మరియు మహా పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## గోషామహల్ స్టేడియంలోనే ఉస్మానియా ఆస్పత్రి

**నెలాఖరులోగా నిర్మాణానికి శంకుస్థాపన**

**ఆ దిశగా చర్యలు చేపట్టండి**

**భవిష్యత్ అవసరాలకనుగుణంగా డిజైన్లు ఉండాలి**

**అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మహా :** నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు సీఎం. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

# 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

**పాల్గొననున్న 16 దేశాలకు చెందిన 47 మంది కైట్ ఫ్లయర్స్**

**పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహణ**

**వివిధ రూపాలలో కనువిందు చేయనున్న కైట్స్, నోరూరించే మిఠాయిలు**




**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 13, 14, 15వ తేదీలలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో 7వ అంతర్జాతీయ కైట్ అండ్స్వీట్ ఫెస్టివల్ ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా బేగంపేట్ హరిత ప్లాజాలో పర్యాటక, సాంస్కృతిక శాఖ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటర్నేషన్ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అంతకు ముందు స్వీట్ స్టాల్స్ ను మంత్రి సందర్శించి, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన సాంప్రదాయ మిఠాయిల రుచి చూశారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, .. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా కాస్మోపాలిటన్ సిటీలో స్థిరపడ్డారని వెల్లడించారు. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగుర వేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నారు. వీక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ, భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరని, అదే తెలంగాణ ప్రత్యేకతని అన్నారు. కైట్ ఫెస్టివల్ లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కైట్ ఫెస్టివల్ కు మూడు రోజుల్లో 15 లక్షల మంది దాకా వస్తారని అంచనా ఉంది. ప్రదర్శన తిలకించటానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్. డి. సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో చిరుత కలకలం

**సైన్స్ సెంటర్ వద్ద వ్యక్తిపై దాడి**



**తిరుపతి, మహా :** తిరుపతిలోని జూపార్క్ రోడ్ లో చిరుతపులి కలకలం రేగింది. ఇక్కడి సైన్స్ సెంటర్ వద్ద చిరుతపులి ఓ వ్యక్తిపై దాడి చేసింది. ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. చిరుత బారినపడిన వ్యక్తిని టీటీడీ ఉద్యోగి మునికుమార్ గా గుర్తించారు. అతడు బైక్ పై వెళుతుండగా చిరుత దాడి చేసినట్టు తెలిసింది. ఆధ్యాత్మిక నగరం తిరుపతి శేషాచలం అడవులను ఆనుకుని ఉన్నందున తరచూ చిరుత పులులు అక్కడ ప్రత్యక్షమవుతుంటాయి. పలుసార్లు వన్య ప్రాణులు తిరుపతిలో జనావాసాల్లోకి వచ్చిన సంఘటనలు జరిగాయి. తాజా ఘటనతో తిరుపతి ప్రజలు మరోసారి అప్రమత్తమయ్యారు. చిరుత ఆచూకి కోసం అటవీ శాఖ అధికారులు జల్లెడ పడుతున్నారు.

EDITORIAL ఎడిటోరియల్

# భాస్కరా.. అన్ లక్కీ రామారావా?

తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికారయంత్రాంగం వైఫల్యం, బాధ్యతారాహిత్యం స్పష్టం. అధికారులు మారకుంటే.. తొక్కి నారతీస్తానంటున్న పవన్ కల్యాణ్ భవిష్యత్ లో ఏం చేస్తాడనేది ఆసక్తికరం. తనకు అధికారం అలంకారం కాదుబాధ్యత అని పవన్ అంటున్నారు. బాధ్యతల్లో ఉన్నవారు ఎవరైతే మాకేంటి అని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. భవిష్యత్ లో ఎపి రాజకీయాలను తిరుమల ఘటన ప్రభావితం చేయెుచ్చు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ వరుస సవాళ్ళను ఎదుర్కొంటోంది. కేటీఆర్ ను ఎసిబి, ఈడిలు విచారిస్తుండగా.. అరెస్ట్ జరిగితే ఆ పార్టీకి ఇబ్బందులు తప్పవు. ఎంతోకాలంగా రైతులు ఎదురుచూస్తున్న పెట్టుబడిసాయం, రేషన్ కార్డులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమబాట పడుతున్నారు.

- తాజా రాజకీయ పరిణామాలపై
ఎఎన్ఎన్ సిఈవో కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్





కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

> లక్కీభాస్కర్ లో హీరో బ్యాంకు డబ్బును స్టాక్స్ లోనో, మరో కంపెనీకో ఇచ్చినట్లు ఇక్కడ కేటీఆర్ విదేశీ కంపెనీకి బదిలీచేశారు. మీ డబ్బు అక్కడే ఉందిగా తెప్పించుకోండి అంటూ దబాయిస్తున్నారు. విచిత్రమైన వాదనే ఇది. ఇలాంటి వాదనలతో హర్షద్ మెహతా లాంటి కేసులను కూడా కొందరు గుర్తు చేస్తున్నారు. ఉద్దేశ్యం ఎలాంటిదైనా కావొచ్చు.. కానీ ప్రజాధనం నిర్లక్ష్యంగా విదేశీ ప్రైవేట్ కంపెనీ ఖాతాల్లోకి జొరగొట్టడం ముమ్మాటికీ తప్పేనని చట్టం చెబుతున్న మాట.

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎన్ని గంటలపాటైనా క్యూలైన్లలో నిలుచుని వెంకన్న దర్శనం చేసుకుంటారు భక్తులు. దశాబ్దాలుగా ఏడుకొండలవాడి సన్నిధిలో రద్దీ మామూలే. చిన్నచిన్న అసౌకర్యాలు, అప్పుడప్పుడూ భక్తుల ఫిర్యాదులే తప్ప తిరుమల టెంపుల్ సిటీలో ఎప్పుడూ తొక్కిసలాట లాంటి ఘటన జరగలేదు. ఏడుకొండలపై ఎన్నడూ కనని.. వినని విషాదం. కొండపై ఈ విషాదం ఎలా జరిగింది? ఈ పాపానికి కారకులెవరు? జరిగిన నష్టానికి బాధ్యులెవరు? భక్తుల రద్దీని అధికారులు అంచనా వేయలేకపోయారా? తోపులాట ప్రాణాలు తీసేదాకా వస్తుందని ఊహించలేకపోయారా? ఆరుగురు మరణానికి, 39మంది మంది ఆస్పత్రి పాలుకావడానికి నిండునిర్లక్ష్యం కారణంగా కనబడుతోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రంలో బాధ్యతల్లో ఉన్నవారు బాధ్యతమరిచి ప్రవర్తిస్తే భక్తులు బలైన ఘటన కలిచివేస్తోంది. గతంలోనూ గోదావరి పుష్కరసమయాల్లోనే భారీతొక్కిసలాట జరిగి 23మంది చనిపోయారు. ఇపుడు తిరుమలలో విషాదం. అధికారుల బాధ్యత లేనితనమా? లేక అంతా బాబే చూసుకుంటారనా? కారణమేదైనా పెద్ద నష్టం జరిగింది. పవన్ కల్యాణ్ భగ్గుమంటే కానీ.. కదలిక రాలేదు. నిజాయితీపరుడి ఆవేదనకు ప్రతిరూపంలా పవన్ ప్రతిస్పందన కనిపించింది.

> ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలోనే భారీ దుర్ఘటనలు జరుగుతున్నాయి. గతంలోనూ గోదావరి పుష్కరసమయాల్లోనే భారీతొక్కిసలాట జరిగి 23మంది చనిపోయారు. ఇపుడు తిరుమలలో విషాదం. అధికారుల బాధ్యత లేనితనమా? లేక అంతా బాబే చూసుకుంటారనా? కారణమేదైనా పెద్ద నష్టం జరిగింది.

> తిరుమల సంఘటనలో పవన్ హుందాగా స్పందించిన తీరు భక్తుల మనోభావాలనే కాదు రాజకీయ ప్రత్యర్థుల మనసులు కూడా గెలిచింది. అధికారులు సక్రమంగా పనిచేయకుంటే, చేయించలేకుంటే తాను ఉండి లాభమేంటని పవన్ కల్యాణ్ అంటున్నారు. భవిష్యత్ లో కూటమిలో చీలికకు ఈ సంఘటన బీజం కావొచ్చు. లేదా ప్రభుత్వయంత్రాంగంలో పరిణతి రావొచ్చు. ఏదైనా మార్పు దిశగా తిరుమల ఘటన ఓ సంకేతం

తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీటీడీ చైర్మన్, ఈవో, బోర్డు సభ్యులు క్షమాపణలు చెప్పాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ స్పష్టం చేస్తే ఛైర్మన్ గా బిఆర్ నాయుడు చేసిన వ్యాఖ్యలు భక్తులను ఆశ్చర్యపరిచాయి. జరిగిన తప్పిదానికి తానే క్షమాపణ కోరానని, చైర్మన్, పాలకమండలి సభ్యులు సహా అధికారులకు నామోషీ ఎందుకని పవన్ ప్రశ్నించారు. ప్రజలంతా చూస్తున్నారని చైర్మన్, ఈవో, బోర్డుకు వేరే దారి లేదని పేర్కొన్నారు. జరిగిన దానికి తమకు బాధ్యత లేదని తప్పించుకుంటే ఎలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తొక్కిసలాటతో తమకు సంబంధం లేదని చైర్మన్, అధికారులు అంటే ఎలా? క్షమాపణ చెప్పడం నాకు సరదానా? నేను దోషిగా నిలబడాలా? ఈ ఘటనలో చనిపోయినవారు చాలా గొప్పవాళ్లు. ఎలా ఉందని అడిగితే తమను దేవుడే బయటకు తెచ్చాడని అంటున్నారు. ఒకరకంగా వారంతా పెద్దమనసుతో ఉన్నారు. ఆ మాటలు వింటుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి. అలాంటప్పుడు వీరికి కాకపోతే ఇంకెవరికి క్షమాపణలు చెబుతాం'' అని పవన్ అన్నారు. పవన్ కు ఉన్న బాధ్యత, ఇంగితం టిటిడి బాధ్యతల్లో ఉన్న వారికి లేకుండా పోయింది. పవన్ భగ్గుమంటే దిగి రావాల్సి వచ్చింది కానీ.. ఇప్పటికీ జరిగిన ఘటనపై పశ్చాత్తాపం కనబడడం లేదు. ఎపిలో అధికారుల తీరు కష్టంగా ఉందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను బట్టి స్పష్టమవుతోంది. టిటిడి ఘటనతో కూటమి కొనసాగింపు పై.. ఒక బీజం పడింది. అధికారులు సక్రమంగా పనిచేయకుంటే, చేయించలేకుంటే తాను ఉండి లాభమేంటని పవన్ కల్యాణ్ అంటున్నారు. భవిష్యత్ లో కూటమిలో చీలికకు ఈ సంఘటనను నాందిగా చూడకపోవొచ్చు. అధికారులు మారకుంటే.. తొక్కి నారతీస్తానంటున్న పవన్ కల్యాణ్ ప్రభుత్వనుండి బయటకు రాడన్న గ్యారంటీ కూడా ఏం లేదు. తనకు అధికారం అలంకారం కాదుబాధ్యత. అని పవన్ అంటున్నారు. బాధ్యత తీసుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా లేనపుడు పవన్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరం. ఏమైనా తిరుమల సంఘటనలో పవన్ హుందాగా స్పందించిన తీరు భక్తుల మనోభావాలనే కాదు రాజకీయ ప్రత్యర్థుల మనసులు కూడా గెలిచింది.

ఎసిబి విచారణ నుండి కేటీఆర్ బయటకు వచ్చిన తర్వాత.. అప్పటివరకు ఉన్న ఒత్తిడి తొలగించుకుకుని రిలీఫ్ పొందారు. కానీ ఈనెల 16న ఈడి విచారణ ఉంది. ఎసిబి ముగ్గురు స్టేట్ మెంట్ల ఆధారంగా న్యాయనిపుణులతో సంప్రదించి సంక్రాంతి తర్వాత మళ్లీ పిలవనుంది. అయితే ఎసిబి నుండి బయటకువచ్చాక.. కేటీఆర్ డబ్బుల బదిలీ జరిగిన తీరుపై చెప్పిన వివరణ టివిల ముందు కూర్చున్న ప్రజలకు లక్కీ భాస్కర్ సినిమాను గుర్తు తెస్తుంది. డబ్బు మీది కాదు.. చట్టప్రకారం బదిలీచేయడానికి అనుమతిలేదు. అయినా లక్కీభాస్కర్ లో హీరో బ్యాంకు డబ్బును స్టాక్స్ లోనో, మరో కంపెనీకో ఇచ్చినట్లు ఇక్కడ కేటీఆర్ విదేశీ కంపెనీకి బదిలీచేశారు. మీ డబ్బు అక్కడే ఉందిగా తెప్పించుకోండి అంటూ దబాయిస్తున్నారు. విచిత్రమైన వాదనే ఇది. ఇలాంటి వాదనలతో హర్షద్ మెహతా లాంటి కేసులను కూడా కొందరు గుర్తు చేస్తున్నారు. ఉద్దేశ్యం ఎలాంటిదైనా కావొచ్చు.. కానీ ప్రజాధనం నిర్లక్ష్యంగా విదేశీ ప్రైవేట్ కంపెనీ ఖాతాల్లోకి జొరగొట్టడం ముమ్మాటికీ తప్పేనని చట్టం చెబుతున్న మాట. ఇక ఇలాంటి వెసులుబాటు ఉంటే.. ప్రభుత్వంలో డబ్బులున్నాయని మంత్రులు, అధికారులు తమకు నచ్చినట్లు విచ్చలవిడిగా పెట్టుబడులకు, చేబదుల్లకో మళ్ళించుకోవొచ్చా? వాటినుండి ఆదాయం పొందవచ్చా? ఇవి అర్థంలేని వాదనలే అని న్యాయనిపుణులు అంటున్నారు. చట్టాలు, కేసులు ఎలా ఉన్నా.. కేటీఆర్ అరెస్టయితే కాంగ్రెస్ లేదా బిజెపి అడ్వాంటేజ్ తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ శ్రేణులను కాపాడుకోవడం, ధైర్యం నింపడం కేసీఆర్ కు సవాలే. తెలంగాణ రాజకీయాలు నెలాఖరుకు హీటెక్కనున్నాయి. కేటీఆర్ అరెస్ట్ జరుగుతుందా.. కవిత కేసు తరహాలోనే విచారణ నెలల తరబడి సాగుతుందా? ఏజెన్సీల వ్యూహమేంటి? ప్రభుత్వ పెద్దల ఆలోచనలేంటి? అన్నది ముందుముందు తెలుస్తుంది.

రూటుమార్చిన సీఎం రేవంత్ వివాదాలు విమర్శలకు దూరంగా ఉంటున్నారు. సంక్షేమం ప్రగతిపైనే పూర్తి సమయం కేటాయిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులను పరుగుపెట్టిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త సంవత్సరంలో రూటు మార్చినట్లు కనబడుతోంది. తాను మారానని చెప్పిన సీఎం.. ఆచరణలో దీనిని చూపిస్తున్నారు. పూర్తిగా సంక్షేమం, ప్రగతిపైనే ఫోకస్ పెట్టారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రైతుభరోసాను ప్రకటించారు. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వ్యవసాయ కూలీలకు పథకం అమలు తేదీని ప్రకటించారు. ఒకేసారి మూడుపథకాలతో గ్రామాల్లో సంక్షేమ వాతావరణం తీసుకొచ్చారు. గ్రామపంచాయతీల్లో పెండింగ్ బిల్లులు కూడా ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. రైతుభరోసా అమలుకోసం.. గత కొద్దిరోజులుగా ఇతర బిల్లులన్నీ పెండింగ్ పెట్టి నిబద్ధతతో హామీల అమలుకు పనిచేస్తున్నారు. విపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఎలాంటి విమర్శలుచేసినా పట్టించుకోకుండా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలన్న పట్టుదల కనబడుతోంది. ముఖ్యమంత్రి సంకల్పానికి అధికారయంత్రాంగం పూర్తిగా సహకరిస్తే ప్రజల్లో మంచి వాతావరణం ఏర్పడుతుంది.

> చట్టాలు, కేసులు ఎలా ఉన్నా.. కేటీఆర్ అరెస్టయితే కాంగ్రెస్ లేదా బిజెపి అడ్వాంటేజ్ తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ శ్రేణులను కాపాడుకోవడం, ధైర్యం నింపడం కేసీఆర్ కు సవాలే. లక్కీ భాస్కరా.. అన్ లక్కీ రామారావా? అన్నది ఈడి విచారణలో తేలుతుందని.. ఇది లొట్టపీసు కేసు అంటూ అవహేళన చేస్తున్న వారికి సమాధానం లభిస్తుందని ఓ సీనియర్ న్యాయవాది అన్నారు.

> రూటుమార్చిన సీఎం రేవంత్ వివాదాలు విమర్శలకు దూరంగా ఉంటున్నారు. సంక్షేమం ప్రగతిపైనే పూర్తి సమయం కేటాయిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులను పరుగుపెట్టిస్తున్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రైతుభరోసాను ప్రకటించారు. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వ్యవసాయ కూలీలకు పథకం అమలు తేదీని ప్రకటించారు. ఒకేసారి మూడుపథకాలతో గ్రామాల్లో సంక్షేమ వాతావరణం తీసుకొస్తున్నారు. ఈ సంక్రాంతి తర్వాత సంక్షేమ క్రాంతి తీసుకురావాలన్న ప్రయత్నాల్లో ప్రభుత్వపెద్దలు సఫలం కావాలని ఆశిద్దాం.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# పాకిస్తాన్‌కు బంగారమే బంగారం


## ఇది కదా అదృష్టమంటే.. త్వరలోనే తవ్వకాలు



**మహా:** పాకిస్తాన్ నక్కతోక తొక్కింది. బంగారం ఒక్కసారిగా వచ్చిపడింది. బంగారం కిటుకు తెలిసింది. ఈ బంగారంతోనైనా ఆర్థికకష్టాలు గట్టెక్కుతుందా లేదా అన్నది వందటన్నుల బంగారం ప్రశ్న. ఆర్థికంగా కుంగిపోయి దివాళా తీసిన పాకిస్తాన్ కు ఇపుడు అనూహ్యంగా అదృష్ట దేవత కరుణించింది. పాకిస్తాన్ భూభాగంలోని సింధూ నది సమీపంలో భారీ బంగారు నిల్వలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ పాకిస్తాన్ ప్రకటించింది. పంజాబ్ రాష్ట్రంలోని అట్టోక్ జిల్లా భూభాగంలోని సింధూ నదిలో 32.6 మెట్రిక్ టన్నుల బంగారం నిధి ఉందని.. ఆ నిధి విలువ సుమారు 600 బిలియన్ పాకిస్తానీ రూపాయలని పేర్కొంది. భారత్ కరెన్సీలో దీనివిలువ రూ.18 వేల కోట్లకు పైనే. కొన్ని నెలల క్రితమే చైనా భూభాగంలో కూడా రూ.7 లక్షల కోట్ల బంగారు నిల్వలు ఉన్నట్లు తెలిసింది. చైనా జాతీయ మీడియా ప్రకారం పింగ్ జియాంగ్ కౌంటీలో 1000 మెట్రిక్ టన్నుల హై క్వాలిటీ బంగారం ఉన్నట్లు గుర్తించారు. ఈ బంగారం విలువ సుమారు రూ.6,91,473 కోట్లు అని అంచనా. ప్రపంచలోనే ఇంత పెద్ద మొత్తంలో బంగారు నిల్వలు బయటపడడం ఇదే తొలిసారి. పాకిస్తాన్ దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. దేశ ఖజానాలో విదేశీ కరెన్సీ నిల్వలు ఆవిరైపోయాయి. యువతకు ఉద్యోగాలు లేక, ప్రజలు ఆహారం లభించక విలవిల్లాడుతన్న పరిస్థితి. ఇలాంటి తరుణంలో అనుకోకుండా పాకిస్తాన్ జియోలాజికల్ సర్వే కంటికి భారీ బంగారు నిధి కనిపించింది. సిందూ నదిలో బయటపడిన బంగారు నిల్వలతో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పెట్టేందకు ఓ మార్గం లభించింది. సింధూ నదిలో బంగారు నిల్వలు కనుగున్నట్లు ముందుగా పాకిస్తాన్ లోని పంజాబ్ రాష్ట్ర మైనింగ్ మంత్రి ఇబ్రహీం హసన్ మురాద్ ప్రకటించారు. జియోలాజికల్ సర్వేలో ఈ విషయం బయటపడిందన్నారు. ఈ ప్రకటనలో అక్కడ కొంతమంది అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అక్రమ తవ్వకాలను నిరోధించడానికి ప్రభుత్వం మైనింగ్ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభించనుందని మీడియా తెలిపింది. అట్టోక్ జిల్లాలో సింధూ నదిలో బయటపడిన ఈ బంగారు గని సుమారు 32 కిలోమీటర్ల పొడవు ఉంటుందని నిపుణలు చెబుతున్నారు. వీటికి తోడు పంజాబ్ లోని ఇతర ప్రాంతాలు, ఖైబర్ పఖ్తూన్ఖ్వా రాష్ట్రాల్లోని పెషావర్ , మర్దాన్ ప్రాంతాల్లో కూడా బంగారు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. పాకిస్తాన్ భూభాగంలో ఖనిజ వనరుల కోసం వెతుకుతుండగా ఈ బంగారు గని ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం సింధూ నది ప్రాంతంలో 2022 నుంచి ప్రభుత్వం సెక్షన్ 144 విధించి అక్రమ తవ్వకాలు, మైనింగ్ చర్యలపై నిషేధం విధించింది. సింధూ నదీ ప్రాంతంలో బయటపడిన బంగారు ఖనిజాల నిల్వలు హిమాలయ పర్వతాల కింద లక్షలాది సంవత్సరాల క్రితం జరిగిన టెక్టానిక్ చర్యల వల్ల ఏర్పడ్డాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నది పాకిస్తాన్ మీదుగా ప్రవహించడంతో హిమాలయాల నుంచి నదీ మార్గంలో బంగారు ఖనిఖ పదార్థాలు కూడా ఆ దిశగా ప్రవహించాయని చెబుతున్నారు. అయితే ఈ ఖనిజాలు బయటికి తీయడానికి చలికాలం అనువైన సమయమని.. చలికాలంలో నదీ జలాలు తక్కువ ఉండడమే దీనికి కారణమని గనుల తవ్వకాల నిపుణుల అభిప్రాయం. అయితే ఈ ప్రాంతంలో గనుల తవ్వకాలపై పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పేచీ నడుస్తోంది. వాటాల గురించి చర్చల తరువాత గనులలో తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. దీంతో బంగారు వెలికితీత పనుల్లో జాప్యం జరుగుతోంది.

# అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

## తాజాగా పేర్కొన్న సీఎం చంద్రబాబు నాయుడు



**ఏపీ:** బీసీల ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సోషల్ మీడియా(ఎక్స్) వేదికగా వెల్లడించారు. '1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటునే ప్రథమ స్వాతంత్ర్య యుద్ధం అంటారు, కానీ అంతకుముందే 1846లో తెలుగునాట ఉయ్యాలవాడ నరసింహా రెడ్డితో కలిసి బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వడ్డే ఓబన్న వీరోచితంగా పోరాడారు. ఆనాటి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న. ఆయన చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించాం. వడ్డే ఓబన్నకు ఆదర్శంగా మెరుగైన సమాజం నిర్మాణం కోసం కృషి చేయాలి' అంటూ అందులో పేర్కొన్నారు.

# ప్రయాణికులకు భారీ శుభవార్త

**ఏపీ:** సంక్రాంతి పండుగ సందర్భంగా బస్ ప్రయాణికులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఏపీలోని ప్రధాన నగరాల్లోని బస్టాండులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్న దృష్ట్యా వారిని స్వస్థలాలకు చేర్చేందుకు ప్రైవేట్ వాహనాలను నడపాలని నిర్ణయం తీసుకుంది. ఆంధ్రుల అతిపెద్ద పండుగ సంక్రాంతికి పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఖాళీగా ఉండే స్కూల్, కళాశాల బస్సులను రద్దీ ప్రాంతాల్లో నడిపించి, ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేయాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రద్దీగా ఉండే నగరాల్లో వెంటనే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సులను నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు సూచించారు. ఈ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నడిపి ప్రయాణ కష్టాలు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు భారీగా సొంత ఊర్లకు బయలుదేరి వెళ్తుండడంతో ఆయా టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు తదితర పట్టణాల గుండా గ్రామాలకు వెళ్లడానికి ప్రజలు భారీగా తరలిరావడంతో బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. రైల్వే స్టేషన్లు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి.

# అభిషేక్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న జగన్ దంపతులు





## పార్టీలకతీతంగా తరలివచ్చిన నేతలు

**కడప, మహా:** మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమీప బంధువు, వైసీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, యువనేత డాక్టర్ వైఎస్ అభిషేక్ రెడ్డి అంత్యక్రియలు పూర్తయ్యాయి. అభిషేక్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బెంగుళూరు నుంచి పులివెందుల చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సతీమణి వైయస్ భారతీలు కుటుంబ సభ్యులను పరామర్శించి పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయిన అభిషేక్ పార్థివదేహాన్ని చూసి, తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అనంతరం అభిషేక్ కు నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని ఆయన ఓదార్చారు. అనంతరం అయన నివాసం నుంచి సమాధుల తోట వరకు నిర్వహించిన అంతిమయాత్రలో జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అభిషేక్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియలో పాల్గొన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం రెడ్డి, సుధీర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబులు, పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి, కమలాపురం టిడిపి నేత పుత్తా నరసింహారెడ్డితో పాటు మరికొందరు టీడీపీ నేతలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అభిషేక్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

# టీటీడీ పాలక మండలి రాజీనామా చేయాలి

- భక్తుల మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణం
- చంద్రబాబు ప్రచార పిచ్చి వల్ల పలువురు మృతిచెందారు
- మాజీ ఎంపీ భరత్ డిమాండ్



**ఏపీ:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటన విషయమై కూటమి ప్రభుత్వంపై మాజీ ఎంపీ భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనకు టీటీడీ పాలకమండలి బాధ్యత వహించి, పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం రాజమండ్రిలో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యంతోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయ్యారని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. టీటీడీ చైర్మన్, ఈవోల మధ్య సమన్వయ లోపం ఉందని స్పష్టంగా అర్థమవుతుందని ఆయన విమర్శించారు. గతంలో చంద్రబాబు ప్రచార పిచ్చి కారణంగా రాజమండ్రి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయ్యారన్నారు. వైఎస్ జగ్ హయాంలో ఏనాడు, ఎక్కడా కూడా ఇటువంటి సంఘటనలు జరుగలేదని ఆయన స్పష్టం చేశారు. క్షమాపణ చెబితే ప్రాణాలు తిరిగి వస్తాయా అని టీటీడీ చైర్మన్ వ్యాఖ్యానించడం అత్యంత దారుణం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఒక బ్లాక్ డేగా మిగిలిపోతుందని అన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈ ఘటనను సుమోటోగా తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. ఈ మొత్తం ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.



# బాధిత కుటుంబానికి జనసేన చేయూత

**విశాఖ, మహా:** అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆర్థిక, అనారోగ్య కారణాలతో సతమతమవుతున్న ప్రగడ బాబుజీ కుటుంబానికి తిమ్మాపురం జనసైనికులు చేయుతను అందించి అండగా నిలిచారు. శానాపతి బాబురావు (మాష్టారు) ఆధ్వర్యంలో దాతల నుండి సేకరించిన రూ. 67,500ను జనసేన పార్టీ తిమ్మాపురం అధ్యక్షుడు ప్రసాదుల గణేష్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందచేసి వారి దాతృత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ బుజ్జి, శానాపతి లోవరాజు, వంగలపూడి నానాజీ, జంప శ్రీనివాస్, వంగలపూడి రాము, టేకు చందు, దమ్ము రాజు, శానాపతి శ్రీరామ్ కుమార్, ప్రగడ శ్రీనివాస్, ప్రగడ పోతురాజు,సమ్మెంగి శ్రీనివాస్, సమ్మెంగి వికాస్, తర్ర బాలు, గుర్రం బాబి, గణేష్ పాల్గొన్నారు.

# లింగరాజు పాలెంలో కొవ్వొత్తులతో నిరసన

## అల్లూరి విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని శిక్షించాలని డిమాండ్



**విశాఖ, మహా:** అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం లింగరాజు పాలెం గ్రామంలో గత నెల 31న అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అల్లూరి సీతారామరాజు గారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీనిపై లింగరాజుపాలెం గ్రామానికి చెందిన క్షత్రియ సేవా సమితి వారు ఎస్ రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేసి నేటికీ 12 రోజులు అవుతున్నా పోలీసులు దుండగులను అరెస్టు చేయడంలో తీవ్రంగా విఫలం చెందారని పేర్కొంటూ, నిరసనగా శనివారం లింగరాజుపాలెంలో అల్లూరి సీతారామ రాజు విగ్రహం వద్ద సీపీఎం నాయకులు, క్షత్రియ సేవా సమితి సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ ఘటనపై నేటికీ రాష్ట్ర హోంమంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే హోంమంత్రి స్పందించి దుండగులను అరెస్టు చేసే విధంగా పోలీస్ వారికి ఆదేశాలివ్వాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, ఎం. రాజేష్, గణపతి రాజు, ఎ. సీతారామరాజు, సాంబమూర్తి రాజు, సన్యాసిరాజు, డి. సీతారామరాజు, అప్పలనరసిహారాజు, వెంకట క్రృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.



# సమ్మె విరమించిన ఏపీఎండీసీ కార్మికులు

**అన్నమయ్య జిల్లా, మహా:** ఏపీఎండీసీ కార్మిక సంఘాల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లెలోని కుడా చైర్మన్ కార్యాలయంలో ఏపీఎండీసీ కార్మిక సంఘాల సమస్యలపై సంబంధిత అధికారులు, కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా ఏపీఎండీసీ కార్మిక సంఘాలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేయడం జరుగుతుందన్నారు. వారి సమస్యలపై ఏపీఎండీసి మేనేజింగ్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, గనుల శాఖ మంత్రితో సంప్రదించి జనవరి 25 లోపల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని కార్మిక సంఘాలకు మంత్రి హామీ ఇచ్చారు. దీంతో వారు తాత్కాలికంగా సమ్మె విరమించారు. ఇందులో ముఖ్యంగా ఏపీఎండీసీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ కార్మికులకు పే స్కేల్స్ కేటాయించాలని, ప్రమోషన్లు కల్పించాలని, సీఎండీ టెండర్ ను ఆపాలని, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఈ సమస్యలన్నీ 25 లోపల పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు తాత్కాలికంగా సమ్మె విరమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ కార్మిక సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

## మృతుల్లో ఇద్దరు మహిళలు.. మరో ఇద్దరి పరిస్థితి సీరియస్




**ఏపీ:** కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. జిల్లాలోని కత్తిపూడి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఆగిఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మహిళలు అక్కడికక్కడే చనిపోగా ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. భీమవరం నుంచి అన్నవరం దర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

# గ్రీన్ కో ఎనర్జీ ప్రాజెక్ట్ ప్రతిష్టాత్మకమైనది

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**కర్నూలు, మహా:** ప్రపంచ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా పర్యటన లో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓర్వకల్లు మండలం గని సమీపంలో ఉన్న సోలార్ పార్క్, గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను హెలికాప్టర్ లో ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ లోని హెలిప్యాడ్ కు చేరుకుని పరిశీలించారు. అప్పర్ రిజర్వాయర్, అప్పర్ ఇన్ టేక్ పాయింట్, ప్రాజెక్ట్ సైట్, పవర్ హౌస్ తదితర ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్ట్ పనితీరు, రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి గురించి కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం డిప్యూటీ సిఎం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో గ్రీన్ కో కంపెనీకి చాలా ప్రతిష్టాత్మకమైన పేరు ఉందన్నారు. ఈ కంపెనీ ఇప్పటివరకు భారతదేశంలో రూ. లక్షన్నర కోట్లు పెట్టుబడి పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 30 వేల కోట్లు పెట్టుబడి పెట్టారన్నారు. ఇవి కాకుండా అదనంగా మరో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నారన్నారు. 12,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించారని, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. పిన్నాపురం ప్రాజెక్ట్ కు ఇప్పటివరకు రూ. 12 వేల కోట్లు పెట్టుబడి పెట్టారన్నారు. అదనంగా మరో రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత రెండు దశాబ్దాలుగా ఐటీ, తర్వాత గ్రీన్ ఎనర్జీ పై దృష్టి పెట్టారన్నారు. 2021 సంవత్సరంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు చాలా వేగవంతంగా ముందుకు వెళుతుందన్నారు. ఈ ప్రాజెక్టులో అటవీ శాఖకి సంబంధించి ఏవో ఉల్లంఘనలు జరిగాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టును చూసేందుకు వచ్చానన్నారు. ఉమ్మడి జిల్లాలో పిన్నాపురం ప్రాజెక్టు మొత్తం 2 వేల 800 ఎకరాలలో ఉందన్నారు. ఇందులో కంపెనీ ప్రభుత్వం నుండి లేదా రైతుల నుండి 1700 ఎకరాల భూమిని కొనిందన్నారు. కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని కంపెనీ కొనుగోలు చేసిందన్నారు..ఇందు కోసం కాంపెన్సేటరీ యాక్ట్ కింద 365 హెక్టార్ల భూమిని నెల్లూరు లో ఇవ్వడంతో పాటు అటవీ మొక్కల పెంపకానికి అదనంగా 36 కోట్ల రూపాయలను కూడా ఇచ్చారన్నారు.. ఈ ప్రాజెక్టు లో రెవెన్యూ, అటవీ శాఖ మధ్య 45 హెక్టార్ల భూమికి సంబంధించి కొంత వివాదం ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్రం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు.

# మెప్మా ఆర్పీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్

**కడప, మహా:** మెప్మా ఆర్పీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ కడప జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఎన్జీయూ కార్యాలయంలో మెప్మా ఆర్పీల సమావేశం కళావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ 16 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ. 26 వేలు కనీస వేతనం నేరుగా బ్యాంకు అకౌంట్‌ల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రగతి, బీఎల్ఓ డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్త్రీ నిధి ఇలా అనేక రకాల పనులు ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో చేయిస్తుందన్నారు. ఆర్పీలకు 2019లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఏ కారణంతోనైనా మృతిచెందిన ఆర్పీలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని, చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు సుబ్బారాయుడు, ఆర్పీలు బీబీ, శ్రీదేవి, విజయలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు

# మంత్రి ఆనం దిగజారి మాట్లాడుతున్నారు

- దేవుడిపై భక్తి ఉంటే ఆ దృశ్యాలను విడుదల చేయాలి
- లేకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాలి
- మంత్రికి భూమన కరుణాకర్ రెడ్డి సవాల్



**ఏపీ:** రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డిపై టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఘటనలో గాయపడ్డ వారిని పరామర్శించేందుకు వెళ్లిన వైసీపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలని డబ్బులు పంచారని, ఆసుపత్రిలో పరికరాలను ధ్వంసం చేసిన దృశ్యాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయని మంత్రి ఆరోపించారు. ఆ ఆరోపణలను భూమన కరుణాకర్ రెడ్డి ఖండించారు. మంత్రికి దేవుడి మీద భక్తి ఉంటే సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను విడుదల చేయాలని ఆయన సవాల్ విసిరారు. లేనిపక్షంలో మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలన్నారు. మంత్రి దిగజారి మాట్లాడుతున్నారంటూ భూమన సీరియస్ అయ్యారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకోవడానికి టీటీడీ తిరుపతిలో టోకెన్ల జారీ కేంద్రాలను ప్రారంభించింది. ఈ క్రమంలో పద్మావతి పార్కులో నెలకొల్పిన కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిచెందగా, మరో 48 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిని రుయా, స్విమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా వెళ్లి పరామర్శించారు. అయితే, ఆ సమయంలో క్షతగాత్రులు వ్యతిరేకంగా మాట్లాడాలని కవర్లలో డబ్బులు పంచారంటూ మంత్రి ఆనం ఆరోపణలు చేశారు.

# 13న హోం మంత్రి స్వగృహం వద్ద సంక్రాంతి సంబరాలు

## అంబరాన్ని అంటేలా ఏర్పాట్లు

**విశాఖ, మహా:** పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలో హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి. ఈ నెల 13న సోమవారం ఉదయం భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు ప్రారంభం కానున్నాయని టీడీపీ నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు జరగనున్నాయని, విజేతలకు మొదటి బహుమతి (రూ. 20,000), ద్వితీయ బహుమతి (రూ. 15,000) తృతీయ బహుమతి (రూ. 10,000) అందజేయనున్నట్లు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రా సంప్రాదాయాలు ఉట్టిపడేలా కోలాహాలంగా కోలాటాలు, తప్పుడుగుళ్ళు కళాకారుల ప్రదర్శనలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, ఎస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు అమలం కంటి అబద్ధం, కోటఉరట్ల మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, పాయకరావుపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షరాలు రమాకుమారి, కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్, వైబోయిన రమణ, వెలగా శ్రీను, సీహెచ్ పద్దు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటిలో స్వామివారికి చక్రస్నానం

## తిరుమలలో కొనసాగుతున్న ఏకాదశి ఉత్సవాలు



**ఏపీ:** వైకుంఠ ద్వాదశి సందర్భంగా తిరుమలలో ఉత్సవాలు అత్యంత ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్తర ద్వారా దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తిరుపతికి తరలివస్తున్నారు. పదిరోజుల పాటు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా శనివారం పుష్కరిణి తీర్థ ముక్కోటిలో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. వేకువజామున సుదర్శన చక్రత్తాళ్వార్‌ను పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్ తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. అనేక వేల తీర్థాలలో, స్వామి పుష్కరిణి అత్యంత పవిత్రమైనదని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో, బోర్డు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగకు ఆ జిల్లాలకు వర్షం ఎఫెక్ట్

## హెచ్చరికలను జారీ చేసిన వాతావరణశాఖ

**ఏపీ:** రాష్ట్రంలో వర్షానికి సంబంధించి వాతావరణ శాఖ తాజాగా హెచ్చరికలను జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో విస్తరించి ఉందని పేర్కొంది. ఈ కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాలో వర్షాలు పడుతాయని స్పష్టం చేసింది. ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాలో మరో రెండ్రోజులు పొడి వాతావరణం ఉంటుందని సూచించింది. ఉపరితల ప్రభావం మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో మరో మూడు, నాలుగు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం లేకపోలేదని స్పష్టం చేసింది. రాయలసీమ, దక్షిణ కోస్తాలోని పలు ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. వైఎస్సార్, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్యతో పాటు పలు జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉంటే, తెలంగాణలో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొన్నది. తెలంగాణలో రాబోయే ఐదు రోజుల్లో ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉందని, అదేవిధంగా రానున్న 3 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయని తెలిపింది.

# మున్సిపల్ కార్మికులకు ఒకే పూట పని విధానం కల్పించాలి

## సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహా



**అబ్దుల్లాపూర్మెట్, జనవరి 11, మహా:** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ఉన్నట్లుగానే పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఒకే పూట పని విధానం అమలు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ చైర్పర్సన్ పందుగుల జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మున్సిపాలిటీలో పరిధిలోనైనా పనిచేస్తున్న కార్మికులు ఎనిమిది గంటలు పనిచేస్తున్నారన్నారు. 'కార్మికులందరూ తెల్లవారు జామున (ఉదయం) 5 గంటలకు వెళ్లి... ఉదయం 10 గంటలకు పనిలోంచి ఇంటి వెళుతుంటారు.. మరల మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లి... సాయంత్రం 5 గంటలకు దిగుతారు. ఇలా కాకుండా రెండుసార్లు రావడం, పోవడం కార్మికులకు ఇబ్బందిగా ఉంది' అని ఆయన అన్నారు. అందువల్ల వారికి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనులు చేస్తే ఎనిమిది గంటలు పూర్తి అవుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఒకపూట కార్మికులకు పని విధానం కల్పించాలని కోరానన్నారు. రంగారెడ్డి జిల్లాలోని చుట్టు పక్కల మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ఒకే పూట విధానం పనులు చేస్తున్నారని గుర్తుచేశారు. ఒక్క పెద్దఅంబర్పేట్ మున్సిపాలిటీలో పని చేసే కార్మికులు మాత్రమే రెండు పూటలా పనిచేస్తున్నారన్నారు. చాలా కాలం నుంచి ఒక పూట పని విధానం కల్పించాలని పదేపదే విన్నవించినా ఎవ్వరు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారైనా ఒకపూట పని విధానం కల్పించాలని కార్మికుల తరపున సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, ముత్యాలు, మున్సిపాలిటీ జవాన్ మైసయ్య, పోచయ్య, లింగయ్య, మహిళ కార్మికులు తదితరులున్నారు.

# జనతా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## కాంగ్రెస్ లో చేరిన యూనియన్ నాయకులు, డ్రైవర్లు.. కండువాలు కప్పి స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా:** జనతా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు వస్తున్న ఆటో డ్రైవర్లకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డైట్ కాలేజి మైదానం నుండి పెద్ద సంఖ్యలో ఆటోలతో ప్రజా సేవాభవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఖాకీ చొక్కా ధరించి కంది శ్రీనివాస రెడ్డి డైట్ గ్రౌండ్ నుండి కలెక్టర్ చౌక్ వరకు ఆటో నడిపారు. అనంతరం శ్రేణులు ఆటో యూనియన్ నాయకులతో కలిసి తన క్యాంపు కార్యాలయం వరకు పాదయాత్రగా వచ్చారు. ఆ తర్వాత క్యాంపు కార్యాలయంలో వారందరికీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇంత పెద్ద ఎత్తున ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అందరి చేరికతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి పార్టీ కోసం పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే ప్రతీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నుస్రత్ ఖాన్, జహీర్ రంజాని, బండారి సతీష్, ఆవుల వెంకన్న, కిజార్ పాషా, శంకరయ్య, లోక ప్రవీణ్ రెడ్డి, షౌకాత్, ఆశన్న, బూర్ల శంకరయ్య, అల్చెట్టి నాగన్న, దాసరి ఆశన్న, బత్తుల శ్రీనివాస్, బండి సుదర్శన్, దీపక్ రావు, గంగన్న, ప్రకాష్, అల్లాబకష్షాజా లింగన్న, ఎల్మ రామ్ రెడ్డి, మానే శంకర్, ఎంఏ కయ్యూమ్, అఫ్రోజ్ అహ్మద్, ఖలీల్, నదీమ్, తలా చౌష్, అంజా, మహమూద్, అహ్మద్, తిప్పిరెడ్డి విట్టల్ రెడ్డి, అశోక్, రమేష్, జనతా యూనియన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# 12 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సీజ్

## 21 బస్సులపై కేసు నమోదు

### విజయవాడ హైవేపై ఆర్టీఏ అధికారుల తనిఖీలు

**ఎల్బీనగర్, జనవరి 11, మహా:** సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊర్లకు ప్రయాణికులు బయలుదేరి వెళ్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్టీఏ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి 9 గంటల తర్వాత ఈ రైడ్స్ ప్రారంభించి హైదరాబాద్ నుండి ఏపీకి వెళ్ళే బస్సులను టార్గెట్ చేసి వాటి ఫిట్నెస్ చెక్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైకి వస్తున్న వెహికల్స్ ను సీజ్ చేస్తున్నారు. తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు తనిఖీలు చేసి ఏపీ నుండి హైదరాబాద్ కు వచ్చే వెహికల్స్ ను సెర్చ్ చేస్తున్నారు. ఎల్బీ నగర్ చింతలకుంటలో దాడులు చేసి 21 బస్సులపై కేసు నమోదు చేసి, ఒక బస్సును సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్ పేట్ ఔటర్ వద్ద చేసిన తనిఖీలలో 11 బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

# కాకతీయ జూలాజికల్ పార్కులో నూతన ఎంక్లోజర్స్

- ప్రారంభించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నగర మేయర్



**హనుమకొండ, మహా:** నగరంలోని కాకతీయ జూలాజికల్ పార్క్ లో నూతనంగా రెండు రాయల్ బెంగాల్ టైగర్స్ కోసం ఏర్పాటు చేసిన ఎన్ క్లోజర్ హాగ్ డీర్ బార్కింగ్ డీర్ల ఎంక్లోజర్స్ అడవి దున్నల ఎంక్లోజర్స్ ను రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తో కలిసి ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ రూపొందించిన క్యాలెండర్ ను, జంతువులను దత్తత తీసుకోవడానికి సంబంధించిన కరపత్రాన్ని, సందర్శకులు పార్క్ లో వినియోగించడానికి వీలుగా తయారు చేసిన బట్ట సంచులను విచ్చేసిన అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ (పశ్చిమ) శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితోపాటు కార్పొరేటర్లు రావుల కోమల, మామిండ్ల రాజు, అటవీ శాఖ ఉన్నతధికారులు తదితరులు పాల్గొన్నారు.






# ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

**వరంగల్, మహా:** ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి పోలీసులు కాపాడారు. కుటుంబ కలహాలతో దుగ్గొండి గ్రామం శివారులోని నల్లబెల్లి రోడ్ వైపులో గల పెద్ద చెరువు దగ్గర ప్రకాష్ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నిస్తున్నాడంటూ దుగ్గొండి పోలీస్ స్టేషన్ కు 100 డయల్ ద్వారా శనివారం సమాచారం రావడంతో పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ రాకేష్‌లు ఇద్దరు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. అనంతరం ఆ వ్యక్తి చేతిలో ఉన్న పురుగులమందు డబ్బాను లాక్కొని అతడిని కాపాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి, 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రకాశ్ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

# సంక్షేమ పథకాల అమలులో తారతమ్యాలకు తావుండదు

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..- జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు




**ఇబ్రహీంపట్నం, జనవరి 11, మహా:** ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్క పేద వారికి లబ్ధిచేకూరే విధంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యుల సూచనలను, అభిప్రాయాలను అధికారులు పరిగణలోకి తీసుకోవాలన్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేసే రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఎంపిక చేయుటలో ప్రణాళిక బద్ధకంగా అమలు చేయాలన్నారు. ఈ నాలుగు పథకాల అమలుపై గ్రామస్థాయిలో మున్సిపల్ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి లిస్టులను వార్డు వద్ద ఉండే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగారపు దయానంద్, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, అరికె పూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, వీర్లపల్లి శంకర్, ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్స్ కమీషనర్ కె.శశంక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, మూడు జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం

**వరంగల్, మహా:** తూర్పు నియోజకవర్గంలోని ఎంజీఎం ఎదురుగా ఉన్న ఐఎంఏ హాల్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(హైదరాబాద్) డాక్టర్ బి రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై, చేయవలసిన సేవలపై, ఉద్యోగుల పాత్రపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పద్మశ్రీ , డాక్టర్ రవీందర్, డాక్టర్ విజయ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ మోహన్ సింగ్, వైద్యాధికారులు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నర్సింహారెడ్డి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఇన్చార్జి డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి, ఎస్ఓ విజయలక్ష్మి, డీపీఎంవోస్, సిబ్బంది పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ కు కృతజ్ఞతలు తెలిపిన పద్మశాలీలు

## వరంగల్ లో భారీ ర్యాలీ




**వరంగల్, మహా:** టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గూడూరి శ్రీనివాస్ పిలుపు మేరకు శనివారం వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మికులకు వరాల జల్లు కురిపించిన నేపథ్యంలో ర్యాలీని నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పద్మశాలిలకు ఆరాధ్య దైవమైన కొత్తవాడ మార్కండేయ ఆలయం తోరణం నుండి గోపాలస్వామి గుడి జంక్షన్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు, మాక్స్ సంఘాల అధ్యక్షులు పద్మశాలి సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం చిప్ప వెంకటేశ్వర్లు నేత మాట్లాడుతూ చేనేత కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు తెలంగాణ చేనేతల పక్షాన చేతులెత్తి నమస్కరిస్తూ ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, చేనేత సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షులు పంతగాని శ్రీనివాస్, కొలిపాక మదనయ్య, కాంగ్రెస్ పార్టీ 23 వ డివిజన్ అధ్యక్షులు దామెర రాజ్ కమల్, కూచన ఓదెలు, ఎలుగం పెద్ద భద్రయ్య, చిన్న భద్రయ్య, బూర వేణు మాధవ్, యెలుగం సాంబయ్య, మాచబత్తుల కుమారస్వామి, ఆడెపు రవి, ఎలుగం శ్రీకాంత్, దాసరి భాస్కర్, వలుస కిరణ్, కోట మల్లయ్య, వావిలాల భిక్షపతి, కుచన సారయ్య, బొల్లు సతీష్, మండల శంకర్, బాసాని కరుణాకర్, మంత్రి కమలాకర్, దాసరి రాజశేఖర్, పిట్ట రాములు తో పాటుగా 500 మంది చేనేత కార్మికులు పాల్గొన్నారు.




# అభివృద్ధిలో 22వ డివిజన్ ముందంజ

## కార్పొరేటర్ కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు




**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం 22వ డివిజన్ గ్రేటర్ లోనే ఈ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతుంది. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి ప్రస్తుతం బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి. గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో డివిజన్లోని దాదాపు అన్ని కాలనీలలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి చొరవతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు నిర్మాణాలు చక చకా పూర్తవుతున్నాయి. గత 30 సంవత్సరాల నుండి పాత కల్వర్టు కారణంగా వర్షాకాలంలో ఇండ్లలోకి నీరు చేరి సెకండ్ బ్యాంక్ కాలనీ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన కార్పొరేటర్ నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కార్పొరేటర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మెప్మా ఆర్పీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్



కడప, మహా: మెప్మా ఆర్పీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ కడప జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో మెప్మా ఆర్పీల సమావేశం కళావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ 16 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ. 26 వేలు కనీస వేతనం నేరుగా బ్యాంకు అకౌంట్ల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రగతి, బీఎల్ఓ డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్త్రీ నిధి ఇలా అనేక రకాల పనులు ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో చేయిస్తుందన్నారు. ఆర్పీలకు 2019లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యూలర్‌ను రద్దు చేయాలని, ఏ కారణంతోనైనా మృతిచెందిన ఆర్పీలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని, చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు సుబ్బారాయుడు, ఆర్పీలు బీబీ, శ్రీదేవి, విజయలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం

**వరంగల్, మహా:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతంగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల ప్యూరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, డీఎస్ఓ కిష్టయ్య, గృహ నిర్మాణ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్పీఐ పార్టీ అభ్యర్థుల ఫస్ట్ లిస్ట్ విడుదల

## మొత్తం 15 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటన
## కేంద్ర మంత్రి అథవాలేకు చెందిన పార్టీ

**ఢిల్లీ:** ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కూడా పోటీ చేస్తుంది. ఢిల్లీలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఆ పార్టీ తరపున బరిలో దిగనున్న మొత్తం 15 మంది అభ్యర్థుల జాబితాను ఆర్పీఐ విడుదల చేసింది. న్యూఢిల్లీ నుంచి శుభి సక్సేనా, పాలం నుంచి వీరేందర్ తివారీ, మాలవీయనగర్ నుంచి రాంనరేష్ నిషాద్ తో పాటు పలువురు తదితర స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. మొత్తం 70 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం ప్రస్తుతం నామినేషన్‌ల దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 17 వరకు నామినేషన్‌లు వేసేందుకు చివరి తేదీ. ఈ నెల 18న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఈ నెల 20 వరకు చివరి తేదీ. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

# సొంత డబ్బు రూ. 10 లక్షలతో పుస్తకాలు కొన్న పవన్ కల్యాణ్!

## విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవం..పుస్తక మహోత్సవంకు వచ్చిన పవన్ కల్యాణ్
## పిఠాపురంలో లైబ్రరీ నిర్మాణానికి పవన్ ఏర్పాట్లు

**మహా:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు బాగా పుస్తకాలు చదివే అలవాటు ఉంది. ఆయనకు ఎప్పుడు సమయం దొరికినా పుస్తక పఠనంలో నిమగ్నమవుతారు. తాజాగా తన సొంత డబ్బు రూ. 10 లక్షలతో పవన్ కల్యాణ్ పుస్తకాలకు ఆర్డర్ ఇచ్చారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక మహోత్సవం జరుగుతోంది. ఈ పుస్తక మహోత్సవంకు పవన్ వచ్చారు. ఆయన అక్కడకు వస్తున్న విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ అధునాతన సౌకర్యాలతో లైబ్రరీ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఆ లైబ్రరీ కోసం ఆయన ఈ పుస్తకాలను కొన్నట్టు తెలుస్తోంది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో యువతకు పుస్తక పఠనం అలవాటు చేయాలని పవన్ భావిస్తున్నారు.




# శబరిమల యాత్రలో ఓరుగల్లు వాసులు

**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరం 28వ డివిజన్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గందె నవీన్ కుమార్ శిష్య బృందంతో కలిసి శబరిమలకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శబరిమలై యాత్రలో భాగంగా ఇరుముడులతో చిన్న పాదం చేసి, కనుల విందుగా అయ్యప్ప స్వామి దివ్య దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నామని వారు తెలిపారు.







# ఒకే ఐటీఆర్.. ఓ గేమ్ ఛేంజర్..

## దంపతులకు సంయుక్త ఐటీ రిటర్న్

**కొత్త పన్ను విధానంలో కల్పించాలి.. కేంద్రానికి ఐసీఏఐ బడ్జెట్ సూచన**
**మరికొన్ని కీలక ప్రతిపాదనలూ సిఫారసు**




**న్యూఢిల్లీ :** మరో మూడు వారాల్లో కేంద్ర బడ్జెట్ రానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (202526)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పద్దును ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తమ ప్రీబడ్జెట్ మెమరాండంలో కేంద్ర ప్రభుత్వానికి ఓ సూచన చేసింది. నూతన పన్ను విధానంలో భార్యాభర్తలకు ఒకే ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ను కలిసి దాఖలు చేసే అవకాశం కల్పించాలన్నదే ఆ సూచన. ఈ జాయింట్ ట్యాక్సేషన్ స్కీం కుటుంబాలకు లాభిస్తుందని, అంతేగాక పన్ను ఎగవేతలకూ చెక్ పెట్టినట్టవుతుందని పేర్కొన్నది. 'కొత్త పన్ను విధానంలో పెండ్లైన ట్యాక్స్ పేయర్ జంటలకు తమ భాగస్వామితో కలిసి సంయుక్త ఐటీఆర్ దాఖలును ఎంచుకొనే వీలు కల్పించాలి. అలాగే వేర్వేరుగా ఐటీఆర్‌లను దాఖలు చేసే అవకాశం కూడా ఇవ్వాలి' అని ఐసీఏఐ సూచించింది. ఏది ఎంచుకుంటారో ట్యాక్స్ పేయర్స్‌కే వదిలేయాలన్నది.

### ఇప్పటిదాకా..

ఐటీఆర్ దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ప్రస్తుతం పాత, కొత్త పన్ను విధానాలను ఎంచుకొనే వెసులుబాటు ఉన్నది. కొత్త పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎటువంటి పన్నులూ చెల్లించనక్కర్లేదన్న విషయం తెలిసిందే. అయితే ఈ జాయింట్ ఐటీఆర్ ట్యాక్స్ పేయర్స్‌కు దాన్ని రెట్టింపు చేయాలని, పన్ను మినహాయింపును రూ.6 లక్షలకు పెంచాలని ఐసీఏఐ సూచించింది. ఇక పాత పన్ను విధానంలో వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలదాకా పన్ను మినహాయింపున్నది. ఈ క్రమంలోనే జాయింట్ ఐటీఆర్ ప్రతిపాదనను ఐసీఏఐ తీసుకురాగా, జీవన వ్యయాలు పెరిగినందున పన్ను మినహాయింపును కూడా పెంచాల్సిన అవసరం ఉందని గుర్తుచేస్తున్నది. దీంతో ఇప్పుడిది సోషల్ మీడియాలో ట్రెండింగ్ ఉన్నది.

### ఇదీ సంగతి..

నిజానికి దంపతులకు జాయింట్ ట్యాక్సేషన్ అనేది కొత్తదేమీ కాదు. ఆయా అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్నదే. అమెరికా, బ్రిటన్‌లలో భార్యాభర్తలు సంయుక్తంగా ఆదాయ పన్ను రిటర్నును దాఖలు చేసే వీలున్నది. దీనివల్ల విడివిడిగా ఐటీఆర్‌లను దాఖలు చేస్తున్నవారితో పోల్చితే పన్ను మినహాయింపు, పన్ను శ్లాబులు పెరుగుతుండటంతో చాలామంది జాయింట్ ఐటీఆర్‌లనే ఎంచుకొని పన్ను భారాన్ని తగ్గించుకుంటున్నారు. ఈ క్రమంలో భారత్‌లోనూ దంపతులకు జాయింట్ ఐటీఆర్ దాఖలుకు అవకాశమిస్తే కుటుంబాలపై పన్ను భారం తగ్గి, ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని, గృహస్తులకు మేలు జరిగితే దేశ ఆర్థిక వ్యవస్థకూ జరుగుతుందని ఐసీఏఐ అభిప్రాయపడుతున్నది.

### పన్ను రేట్లు తగ్గాలి: అసోచామ్

రాబోయే బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను తగ్గించడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తప్పక దృష్టి సారించాలని అసోచామ్ తమ ముందస్తు బడ్జెట్ నివేదికలో అభిప్రాయపడింది. కార్పొరేట్ పన్ను రేట్లు ఇతర దేశాలతో పోల్చితే పోటీగానే ఉన్నాయన్న ఈ వ్యాపార, పారిశ్రామిక సంఘం.. వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లు మాత్రం తగ్గాల్సిన అవసరం ఉందని గట్టిగా పేర్కొనడం గమనార్హం. గరిష్ఠంగా హాంకాంగ్‌లో 15 శాతం, శ్రీలంకలో 18 శాతం, సింగపూర్‌లో 22 శాతం, బంగ్లాదేశ్‌లో 25 శాతంగా ఉన్నాయని గుర్తుచేసింది.

### ఐసీఏఐ సూచనలివే..

- జాయింట్ ఐటీఆర్ ట్యాక్స్ పేయర్స్‌కు వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపుంటే పన్ను మినహాయింపు.
- సర్‌చార్జ్ వర్తింపు పరిమితి రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పెంపు.
- వార్షిక ఆదాయం కోటిరూ.2 కోట్ల మధ్య ఉంటే సర్‌చార్జ్ 10%.
- రూ.24 కోట్ల మధ్య ఉంటే 15%.
- రూ.4 కోట్లు దాటితే సర్‌చార్జ్ 25%.
- ఉద్యోగులైతే భార్యాభర్తలిరువురికీ స్టాండర్డ్ డిడక్షన్‌ను వర్తింపజేయాలి.
- ప్రతిపాదిత ట్యాక్స్ శ్లాబులు
- జాయింట్ ఐటీఆర్‌లను దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు వర్తించే ట్యాక్స్ శ్లాబులనూ ఐసీఏఐ సూచించింది.
- రూ.6 లక్షలదాకా పన్ను ఉండదు
- రూ.614 లక్షల వరకు 5%
- రూ.1420 లక్షల వరకు 10%
- రూ.2024 లక్షల వరకు 15%
- రూ.2430 లక్షల వరకు 20%
- రూ.30 లక్షలపైన 30%

# రూ.12 లక్షల కోట్లు మటాష్




**న్యూఢిల్లీ:** స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వరుసగా మూడు రోజులుగా భారీ నష్టాల్లో ట్రేడవుతుండటంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోతుండటం, త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు నిస్తేజంగా ఉండటంతో గత మూడు రోజుల్లో రూ.12 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గత మూడు రోజుల్లో సెన్సెక్స్ 820.2 పాయింట్లు లేదా 1.04 శాతం నష్టపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.12,07,314.99 కోట్లు కరిగిపోయి రూ.4,29,67,835.05 కోట్లు(5 ట్రిలియన్ డాలర్లు)కు తగ్గింది. క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం, డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం కూడా మార్కెట్ల పతనానికి కారణం.

మరోవైపు, వారాంతం ట్రేడింగ్‌లో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 241.30 పాయింట్లు నష్టపోయి 77,378.91 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 95 పాయింట్లు కోల్పోయి 23,431.50 వద్ద నిలిచింది. మార్కెట్లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్బీఐ, సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్‌లు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు, టీసీఎస్ షేరు 6 శాతం పెరిగి టాప్‌గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే పవర్ అత్యధికంగా 3.07 శాతం నష్టపోగా, యుటిలిటీ 2.86 శాతం, రియల్టీ 2.64 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.08 శాతం, కమోడిటీస్ 2.05 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.98 శాతం నష్టపోయాయి. కానీ, ఐటీ 3.17 శాతం, టెక్నాలజీ 2.24 శాతం చొప్పున లాభపడ్డాయి.

## ఫిక్స్‌డ్ వడ్డీరేటు తప్పనిసరి: ఆర్బీఐ

**ముంబై:** ఈఎంఐ (నెలవారీ వాయిదా సమాన చెల్లింపులు) ఆధారిత వ్యక్తిగత రుణాల్లో ఫిక్స్‌డ్ వడ్డీరేటు ప్రోడక్ట్‌ను కూడా కస్టమర్లకు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని శుక్రవారం బ్యాంకులకు, తమ పరిధిలోని ఇతర ఆర్థిక సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆదేశించింది. రుణాల మంజూరు సమయంలో వర్తించే వార్షిక వడ్డీరేటు, వార్షిక పర్సంటేజ్ రేట్ల సమాచారం రుణగ్రహీతలకు తెలియపర్చాలని, రుణ ఒప్పందంలో పేర్కొనాలని కూడా స్పష్టం చేసింది. అప్పు తీసుకున్న తర్వాత ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటు కారణంగా ఈఎంఐ లేదా టెన్యూర్‌లో ఏదైనా పెరుగుదల ఉన్నా ఆ సమాచారాన్ని రుణగ్రహీతకు చెప్పాలన్నది. అసలు, వడ్డీ బకాయిలు, మిగిలిన ఈఎంఐల వివరాలనూ మూడు నెలలకోసారి అందజేయాలని ఆర్బీఐ రుణదాతలకు సూచించింది.

## ఈ ఏడాది భారత్ వృద్ధిరేటు అంతంతే..




అంతర్జాతీయంగా స్థిరంగా అభివృద్ధి కొనసాగుతున్నా 2024 25లో భారత వృద్ధిరేటు స్వల్పంగా బలహీన పడవచ్చునని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య విధానం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రాంతీయంగా విభేదాలు ఉన్నా, గ్లోబల్ వృద్ధిరేటు నికరంగా ఉంటుదన్నారు. భారత వృద్ధిరేటు బలహీన పడటానికి కారణాలేమీ చెప్పలేదు. ఐఎంఎఫ్ వరల్డ్ ఎకానమీ ఔట్‌లుక్ ప్రకారం అమెరికా వృద్ధిరేటు అంచనాలకన్నా మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఈయూ అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థపై అధిక ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా అన్నారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ చైనాలో ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొందన్నారు. దేశీయంగా డిమాండ్లకు సవాళ్లు ఎదురవుతాయని చెప్పారు. అన్ని రకాల చర్యలు తీసుకున్నా తక్కువ ఆదాయ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమలు చేసే సుంకాలు, పన్నులు, నియంత్రణ నిబంధనలను అమల్లోకి తెచ్చినా ప్రతికూల ప్రభావం ఉంటుందన్నారు. ఈ నెల 2న అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టనున్నారు. ద్రవ్యోల్బణంపై పోరుకు వడ్డీరేట్లు పెంచక తప్పదని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా తెలిపారు. ఈ నెల 20న అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, చైనా, కెనడాలపై అదనపు సుంకాలు, పన్నులు ఉంటాయని హెచ్చరించారు.



# దేశం-విదేశం

## NATIONAL-INTERNATIONAL





ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే

## ట్రంప్‌ను ఓడించేవాడిని

**జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు**

**మహా:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ చేతిలో కమలా హారిస్ ఓటమిపై ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పోటీల్లో తాను ఉంటే కచ్చితంగా ట్రంప్‌ను ఓడించేవాడినని విశ్వాసం వ్యక్తం చేశారు. డెమొక్రటిక్ పార్టీలో ఐక్యత కోసమే పోటీ నుంచి వైదొలిగానని బైడెన్ పేర్కొన్నారు. ఎన్నికల్లో తిరిగి పోటీ చేయకూడదనే నిర్ణయంపై విచారిస్తున్నారా? ఆ చర్య ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కావడానికి సహాయపడిందా? అంటూ విలేకరులు అడిగి ప్రశ్నకు బైడెన్ ఈ మేరకు స్పందించారు. 'అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ను కమలా హారిస్ ఓడించగలదని అనుకున్నాం. అందుకే ఆమెకు మద్దతిచ్చాం. ఇప్పటికీ కమలా విజయం సాధించగలని నమ్ముతున్నా. అమెరికా రాజకీయాల్లో కనిపిస్తున్న విభజనకు స్వస్తి పలకడానికే అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకున్నా. నేను ఎన్నికల బరిలో ఉంటే ట్రంప్ కచ్చితంగా ఓడిపోయేవారు' అని బైడెన్ అన్నారు.

## బొగ్గు గని నుంచి మరో 3 మృతదేహాలు వెలికితీత

**కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**




**అస్సాం:** వరదలు ముంచెత్తిన అస్సాంలోని బొగ్గు గని వద్ద రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది. అందులో నుంచి మరో మూడు మృతదేహాలను వెలికితీశారు. దీంతో ఆ బొగ్గు గనిలో చిక్కుకున్న కార్మికుల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. కాగా, జనవరి 6న దిమా హసావో జిల్లా ఉమ్రాంగ్సోలోని బొగ్గు గనిలోకి అకస్మాత్తుగా వరద నీరు వచ్చి చేరింది. అస్సాంమేఘాలయ సరిహద్దు సమీపంలోని పాడుబడిన 340 అడుగుల లోతైన ఈ గనిలో 9 మంది కార్మికులు చిక్కుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గత ఆరు రోజుల నుంచి రెస్క్యూ బృందం, ఆర్మీ డైవర్లు కలిసి వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శనివారం ఉదయం తొలుత ఒక మృతదేహాన్ని వెలికితీశారు. కలమతి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆ తరువాత మరో రెండు మృతదేహాలను ఆ గనిలో నుంచి బయటకు తీశారు. దీంతో బొగ్గు గనిలో చిక్కుకున్న 9 మంది కార్మికుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతిచెందారు. మరో ఐదుగురు కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. నీటిని తోడితేగానీ పూర్తిస్థాయిలో సహాయక చర్యలు సాధ్యం కావని అధికారులు చెబుతున్నారు. 12 ఏళ్ల కిందట వదిలేసిన ఈ బొగ్గు గనిలో అక్రమ తవ్వకాలకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## చలి తీవ్రత ఎక్కువగా ఉంది.. జాగ్రత్తలు తీసుకోండి

**జర్నలిస్టులకు ప్రధాని మోదీ సలహా**
**సోషల్ మీడియాలో వీడియో వైరల్**

**ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తాజాగా కీలక సూచన చేశారు. ప్రస్తుతం చలికాలం దృష్ట్యా అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జర్నలిస్టు మిత్రులకు ఆయన సూచించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన.. కారు దిగి నేరుగా జర్నలిస్టుల వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న జర్నలిస్టులతో కొంతసేపు మాట్లాడారు. ముందుగా వారందరికీ నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆయన జర్నలిస్టులకు మోదీ సూచించారు. అనారోగ్యం బారిన పడకుండా తలను కప్పకోండి అంటూ ఆయన సలహా ఇచ్చారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.





## అసెంబ్లీ ఎన్నికల వరకే పొత్తు

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం: సంజయ్ రౌత్**

**మహారాష్ట్ర:** ఇండియా బ్లాక్, మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పొత్తులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలవరకు మాత్రమేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందంటూ ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. కూటమితో ముందుకు వెళ్తే పార్టీల కార్యకర్తలకు అవకాశాలు లభించవన్నారు. అలా వెళితే సంస్థాగత వృద్ధిని అడ్డుకుంటుందంటూ ఆయన పేర్కొన్నారు. ముంబై, నాగ్‌పూర్, థానే, మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో తమ సొంత బలంతోనే ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల తరువాత ఈ కూటమి ఒక్క సమావేశాన్ని కూడా నిర్వహించలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమిలో అతిపెద్ద పార్టీ కాంగ్రెస్.. సమావేశం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ దే.. కానీ, అలా చేయలేదంటూ ఆయన పేర్కొన్నారు. కనీసం కన్వీనర్‌ను కూడా నియమించలేకపోయామన్నారు. ఏకాభిప్రాయం, రాజీపై నమ్మకం లేనివారు కూటమిలో ఉండనవసరం లేదంటూ కాంగ్రెస్ నేత విజయ్ వాడేట్టివార్ పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైల్వేస్టేషన్‌లో కూలిన పైకప్పు

**శిథిలాల కింద చిక్కుకున్న కూలీలు**



**యూపీ:** ఉత్తరప్రదేశ్ లోని కన్నౌజ్ రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ప్రవేశద్వారం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడే నిర్మాణ పనులు చేస్తున్న పలువురు కూలీలు ఆ శిథిలాల కింద చిక్కుకున్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింది చిక్కుకున్న 11 మందిని వెలికితీశాయి. అనంతరం వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. శిథిలాల కిందే చిక్కుకుని ఉన్న మిగతా కూలీలను రక్షించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. రెస్క్యూ టీమ్స్‌తోపాటు స్థానిక అధికారులు, పోలీసులు ఈ సహాయక చర్యల్లో పాల్గొని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ స్పందించారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. గాయపడిన వారికి తక్షణమే అవసరమైన మెడికల్ ట్రీట్‌మెంట్‌ను అందించాలని వారికి సూచించారు. బాధితులంతా త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

# ఉద్ధవ్ ఠాక్రే నాకు శత్రువు కాదు.. మిత్రుడు

**రాజ్ ఠాక్రే అత్యంత సన్నిహితుడు.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్**



**ఏపీ:** ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ థాక్రే తనకు అత్యంత సన్నిహితుడని, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ థాక్రే తనకు శత్రువు కాదు.. మిత్రుడని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తాజాగా పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన ఠాక్రేలతో బీజేపీ సంబంధం గురించి శనివారం ఆయన మాట్లాడారు. గతంలో ఉద్ధవ్ థాక్రే హితుడు. ఇప్పుడు రాజ్ థాక్రే ఒక స్నేహితుడు. కానీ ఉద్ధవ్ థాక్రే శత్రువు కాదు అంటూ ఆయన పేర్కొన్నారు. అదే విధంగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉద్ధవ్ థాక్రేను కలసినదానిపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. ప్రతీకార రాజకీయాలకు తాను ఎప్పుడూ పాల్పడబోనని అన్నారు. నాయకులందరితోనూ సానుకూలంగా వ్యవహరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే... ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ కూడా ఇటీవల ఆర్ఎస్ఎస్‌ను ప్రశంసించిన అంశంపై కూడా ఫడ్నవీస్ స్పందించారు. శరద్ పవార్ అత్యంత తెలివైనవారని ప్రశంసించారు. శరద్ పవార్, అజిత్ పవార్ తిరిగి కలుస్తారన్న ఊహాగానాలపై కూడా ఆయన స్పందించారు. రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు అంటూ ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ సీఎం అభ్యర్థిగా రమేశ్ బిధూరీ..?

**ఒకటి రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం.. ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్**



**ఢిల్లీ:** ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ తాజాగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఢిల్లీ సీఎం అతిషి సింగ్, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రమేశ్ బిధూరీనే బీజేపీ తన సీఎం అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉందని, ఈ మేరకు తనకు సమాచారం అందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ విషయమై రానున్న ఒకటిరెండు రోజుల్లో బీజేపీ అధికారికంగా ప్రకటించనున్నట్టు తమకు సమాచారం ఉన్నదని ఆయన తెలిపారు. బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రకటితం కాబోతున్న రమేశ్ బిధూరీకి అభినందనలు ఆయన పేర్కొన్నారు. అయితే ఆయన ఒక ఎంపీగా ఢిల్లీ అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ పట్ల ఆయనకున్న విజన్ ఏమిటో కూడా చెప్పాలన్నారు. ఆయన పేరును బీజేపీ అధికారికంగా ప్రకటించిన తరువాతనే ఢిల్లీ ప్రజల ముందు బీజేపీ, ఆప్ సీఎం అభ్యర్థుల మధ్య చర్చ జరగాలి అంటూ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే, ఢిల్లీలో వచ్చే నెల 5న అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ జరగనున్నది. 8న ఫలితాలు వెల్లడి కానున్నారు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.



## సౌత్ వాళ్లు తిండి అయినా మానేస్తారు
## కానీ సినిమాలు చూడడం మానరు
### రాశి ఖన్నా

'ది సబర్మతి రిపోర్ట్' సినిమాతో ఇటీవల సూపర్ హిట్ అందుకుంది నటి రాశి ఖన్నా. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసిన ఈ భామ ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. ప్రస్తుతం తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న తెలుసుకదా సినిమాతో పాటు తమిళంలో అగాథియా అనే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తుంది ఈ భామ. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న ఈ అమ్మడు సౌత్ సినిమా అభిమానులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాశి మాట్లాడుతూ.. దక్షిణాదిలో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుడి లాగా కోలుస్తారు. సినిమా విడుదల అప్పుడు పండుగల భావిస్తారు. అందుకే సౌత్‌లో ప్రేక్షకులు తిండి అయిన మానేస్తారు ఏమో కానీ సినిమాలు చూడడం మాత్రం ఆపారు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు అంటూ రాశి ఖన్నా చెప్పుకోచ్చింది.




## సుకుమార్ బర్త్‌డే..
### పుష్ప 2 ది రూల్ నుంచి స్పెషల్ వీడియో

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్'. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించగా.. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్ అందుకోవడమే కాకుండా రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా ఈ సినిమాను చైనాలో కూడా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే నేడు దర్శకుడు సుకుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే తాజాగా పుష్ప మేకర్స్ కూడా సుకుమార్‌కి బర్త్‌డే విషెస్ తెలుపుతూ స్పెషల్ వీడియోను పంచుకున్నారు. ఈ వీడియోలో పుష్ప 2 కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డాడో చూపించడంతో పాటు అల్లు అర్జున్, రష్మిక, శ్రీలీల, గణేష్ ఆచార్య లాంటి వారు సుకుమార్‌తో తమకున్న అనుభవం గురించి పంచుకున్నారు.



## ఆ నొప్పులు సరదాగా ఉంటాయి..

టాలీవుడ్ హీరోయిన్ సమంత.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. తనకు సంతోషం కలిగినా, బాధ కలిగినా.. ప్రతీ విషయాన్ని ఆమె తన అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకుంటుంది. అలానే తాజాగా సమంత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల తాను చికెన్ గున్యా వ్యాధి బారిన పడినట్లు సమంత తెలిపింది. అయితే ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియోను సమంత్ షేర్ చేసింది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్ల నొప్పులు నుంచి కోలుకోవడం అనేది చాలా ఫన్‌గా ఉంటుందంటూ ఆ బ్యూటీ రాసుకొచ్చారు. సమంత త్వరగా కోలుకోవాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. గతంలో సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన సంగతి తెలిసిందే. ఖుషి మూవీ టైమ్‌లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు ఆమె తెలిపింది. అప్పట్నుంచి తన ఆరోగ్యం క్షీణించిందని చెప్పింది. మయోసైటిస్ చికిత్స కోసం మెడిసిన్స్, ఆయుర్వేదం, భూటాన్‌లో ప్రకృతి వైద్యం ఇలా రకరకాల పద్ధతుల్ని సమంత ప్రయత్నించింది.


## నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట



సినీ నటుడు అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. రెగ్యులర్ బెయిల్‌కి అప్లయ్ చేసిన అల్లు అర్జున్‌కి నాంపల్లి కోర్టు ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ నిబంధనను కోర్టు మినహాయించింది. అలాగే విదేశాలకు వెళ్లేందుకు కూడా అల్లు అర్జున్‌కి కోర్టు అనుమతినిచ్చింది. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ గాయలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై అల్లు అర్జున్‌ని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టు ముందు హాజరుపర్చగా.. అతడికి 14 రోజు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది కోర్టు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించగా.. తెలంగాణ హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో బెయిల్ మీద బయటికి వచ్చాడు బన్నీ. అయితే రీసెంట్‌గా బెయిల్ గడువు కూడా ముగియడంతో రెగ్యులర్ బెయిల్ కోసం అప్లయ్ చేసుకోగా.. నాంపల్లి కోర్టు బన్నీకి పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

## బాక్సాఫీస్‌పై గేమ్ ఛేంజర్ దండయాత్ర..
# మొదటి రోజే రూ.186 కోట్లు

రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్‌లో నటించి అలరించాడు. అయితే ఈ సినిమా తొలిరోజే రికార్డు కలెక్షన్లు అందుకుంది. మొదటిరోజు ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.186 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ ఫీట్ సాధించిన టాప్ టెన్ ఇండియన్ సినిమాలలో గేమ్ ఛేంజర్ కూడా నిలిచింది. ఇక మొదటి రోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలు చూసుకుంటే.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ రోజు రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టింది. పుష్ప తర్వాత రాజమౌళి ఆర్ఆర్ఆర్ (రూ.223 కోట్లు), బాహుబలి 2(రూ.214 కోట్లు) చిత్రాలు ఉన్నాయి.






# క్రీడా వార్తలు | SPORTS NEWS



## ఇద్దరు కలిసి కనిపిస్తే డేటింగ్ చేస్తున్నట్లేనా..?
### అనవసరంగా బ్లేమ్ చేస్తే ఊరుకునేది లేదు
### డేటింగ్ వార్తలపై స్పందించిన ఆర్‌జే మహ్వాష్



**ఢిల్లీ:** గత కొద్ది రోజుల నుంచి టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చహల్ తన భార్య ధనశ్రీతో విడిపోతున్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై సోషల్ మీడియా కోడై కూస్తోంది. అంతేకాదు.. ప్రస్తుతం ఈ క్రికెటర్ ఓ ఆర్‌జే ప్రేమలో మునిగితేలుతున్నట్లుగా కూడా వార్తలు వచ్చాయి. ఆర్‌జే మహ్వాష్‌తో పార్టీ చేసుకుంటున్న ఫొటోలు బయటకు రావడంతో వారిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆర్‌జే మహ్వాష్ స్పందించింది. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని పేర్కొంది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. కొన్ని కథనాలు, ఊహాగానాలు ఇంటర్నెట్‌లో వ్యాపిస్తున్నాయని.. అవన్నీ కూడా ఊహాజనిత వార్తలని.. వాటిని చూస్తుంటే తనకు ఫన్నీగా ఉందంటూ అందులో పేర్కొంది. ఏ ఇద్దరు కలిసి కనిపిస్తే డేటింగ్ చేస్తున్నట్లేనా..? ప్రస్తుతం మనమంతా ఏ సంవత్సరంలో ఉన్నాం..? అంటూ ప్రశ్నించింది. ఓ అమ్మాయి, అబ్బాయి కనిపిస్తే డేటింగ్ ఊహాగానాలు ఎందుకు దారి తీస్తున్నాయన్నయంటూ ఆమె అసంతృప్తిని వ్యక్తం చేసింది. కాగా, ఈ విషయమై గత రెండు మూడు రోజులుగా తాను ఓపికతో ఉన్నానని, ఇకముందు తనను అనవసరంగా బ్లేమ్ చేస్తే ఊరుకునేది లేదంటూ ఆమె హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల యుజ్వేంద్ర చహల్, ధనశ్రీ జంట తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో ఒకరికొకరు అన్ ఫాలో అయ్యారు. ఇద్దరి ఫొటోలను తొలగించారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు విడిపోతున్నట్లుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. విడాకులపై చహల్ స్పందించాడు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం తన దృష్టికి వచ్చిందని.. అయితే అవి నిజం కావచ్చు, కాకపోవచ్చునని.. ఇలాంటి ఊహానాలను పట్టించుకోవద్దని.. అభిమానులకు ఇదే నా రిక్వెస్ట్ అంటూ చహల్ ఆ పోస్ట్ లో పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు ధనశ్రీ కూడా స్పందిస్తూ విడాకులపై వస్తున్న వార్తలతో తాను మానసిక వేదనకు గురవుతున్నానని.. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ ఆమె వాపోయిన విషయం తెలిసిందే.

## కేఎల్ రాహుల్ సెలక్షన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన బీసీసీఐ కమిటీ



**ముంబై:** ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో అత్యధిక రన్స్ చేసిన మూడవ ఇండియన్ బ్యాటర్‌గా కేఎల్ రాహుల్(KL Rahul) నిలిచాడు. అతను 30.66 సగటుతో 10 ఇన్నింగ్స్‌లో 276 రన్స్ చేశాడు. అయితే ఫిబ్రవరిలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీపై కన్నేసిన రాహుల్.. త్వరలో ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు దూరంగా ఉండాలని భావించాడు. దీని కోసం అతను రెస్ట్ కోసం బీసీసీఐ నుంచి అనుమతి కూడా తీసుకున్నాడు. కానీ తాజా సమాచారం ప్రకారం.. ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు రాహుల్ అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ.. కేఎల్ రాహుల్‌పై దృష్టి పెట్టింది. నిజానికి తొలుత రాహుల్‌కు రెస్ట్ ఇవ్వాలని భావించినా.. ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండాలన్న అభిప్రాయాన్ని బీసీసీఐ వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడితే, ఆ మెగా టోర్నీకి మ్యాచ్ ప్రాక్టీస్ అవుతుందని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. వికెట్ కీపర్ స్థానం కోసం రిషబ్ పంత్, సంజూ శాంసన్‌తో పాటు కేఎల్ రాహుల్ కూడా పోటీలో ఉన్నాడు. చాంపియన్స్ ట్రోఫీకి రాహుల్‌ను ఎంపిక చేయాలనుకున్న బీసీసీఐ.. ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లోనూ ఆడాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చాంపియన్స్ ట్రోఫీకి వెళ్లే జట్టు వివరాలను కూడా ప్రకటించేందుకు ఐసీసీ నుంచి మరింత సమయాన్ని బీసీసీఐ కోరినట్లు తెలుస్తోంది. షమీ, హర్షదీప్ సింగ్, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి లాంటి పేర్లు చాంపియన్స్ ట్రోఫీ కోసం వినిపిస్తున్నాయి. కానీ దీనిపై మాత్రం ఇంకా పూర్తి క్లారిటీ రావడం లేదు.




## హిందీ భాషపై అశ్విన్ వ్యాఖ్యలను
# సమర్థించిన అన్నామలై

తమిళనాడు రాష్ట్రంలో మరోసారి తమిళ్, హిందీ వివాదం తెరపైకి వచ్చింది. అందుకు కారణంగా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలే. చెన్నైలోని ఓ కళాశాల ఈవెంట్‌కు హాజరైన అశ్విన్.. హిందీ జాతీయ భాష కాదని పేర్కొన్నారు. హిందీ కేవలం అధికారిక భాష మాత్రమే అని వ్యాఖ్యానించారు. క్రికెటర్ వ్యాఖ్యలు ప్రస్తుతం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను కొందరు తప్పుపడుతుండగా.. మరికొందరు సమర్థిస్తున్నారు. ఇక ఈ వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై స్పందించారు. హిందీ భాషపై అశ్విన్ చేసిన వ్యాఖ్యలను సమర్థించారు. అశ్విన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాలని అన్నామలైని మీడియా కోరగా.. 'అశ్విన్ చెప్పింది కరెక్ట్. హిందీ జాతీయ భాష కాదు. హిందీ అనేది కేవలం లింక్ లాంగ్వేజ్ మాత్రమే' అని అన్నామలై స్పష్టం చేశారు. హిందీపై అశ్విన్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్లు తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై పేర్కొనడం ఇప్పుడు మరింత చర్చకు దారి తీస్తోంది. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాల స్నాతకోత్సవానికి అశ్విన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. ఇంగ్లీష్, తమిళ్, హిందీ భాషల గురించి విద్యార్థులను ప్రశ్నించారు. అయితే, హిందీ భాష గురించి ఒకరిద్దరి నుంచి మాత్రమే సమాధానం వచ్చింది. దీనిపై స్పందించిన క్రికెటర్.. 'హిందీ అధికారిక భాష మాత్రమే. జాతీయ భాష కాదు' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

## భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ
### ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్.. 14 నెలల తర్వాత మళ్లీ జట్టులోకి సిరాజ్

**మహా:** ఇంగ్లాండ్‌తో ఈ నెల 22న ఐదు మ్యాచుల టీ20 సిరీస్ జరుగనున్నది. స్వదేశంలో జరుగనున్న టీ20 సిరీస్‌కు బీసీసీఐ శనివారం జట్టును ప్రకటించింది. అయితే, ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ కు 14 నెలల తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి అవకాశం కల్పించారు. జట్టులో సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), హర్షిత్ రాణా, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్) ఉన్నారు.




## టెస్టులకు రవీంద్ర జడేజా గుడ్‌బై..?

టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టులకు గుడ్‌బై చెప్పబోతున్నట్లు సమాచారం. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చేసిన పోస్ట్‌ను బట్టి తెలుస్తున్నది. జడేజా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టెస్ట్ జెర్సీని షేర్ చేశాడు. ఈ క్రమంలో క్రికెట్ నిపుణులతో పాటు అభిమానులు ఆల్‌రౌండ్ రిటైర్మెంట్ గురించి హింట్స్ ఇచ్చినట్లుగా పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా పలువురు యూజర్లు స్పందించారు. ఓ యూజర్ రిటైర్మెంట్‌కు సంకేతమా? అంటూ ప్రశ్నించగా.. మరొకరు శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత టీ20 క్రికెట్‌కు జడేజా రిటైర్మెంట్ ప్రకించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ చెత్త ఫామ్ కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. వీరిద్దరంత కాకపోయినా జడేజాపై సైతం విమర్శలు వచ్చాయి. బోర్డర్ గవాస్కర్ సిరీస్‌ను టీమిండియా 13 తేడాతో ఓటమిపాలైంది. ఆసిస్ పర్యటనలో జడేజా మూడు మ్యాచుల్లో కేవలం నాలుగు వికెట్ల తీశాడు. 27 సగటుతో 135 పరుగులు చేశాడు. సమాచారం మేరకు.. జడేజా ప్రదర్శనపై సైతం సెలెక్టర్లు దబుష్టి సారించారని.. సెలక్షన్ కమిటీతో బీసీసీఐ జడేజా భవిష్యత్‌పై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. జడేజా ఇకపై టెస్టుల్లో కొనసాగడం కష్టమేనని పలు మీడియా నివేదికలు పేర్కొంటున్నారు. భారత్ ఈ నెల 22 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల టీ20, మూడు వన్డేలు ఆడనున్నది.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com